# ప్రజాశక్తి

శుక్రవారం 16 జూన్ 2023

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

# ఎంపీ ఇంట కిడ్నాప్ కలకలం

◆ ఉలిక్కిపడ్డ వ్యాపార దిగ్గజం ఎంవివి

◆ విశాఖలో సంచలనం రేపిన రౌడీషీటర్ హేమంత్ వ్యవహారం

కిడ్నాపర్ హేమంత్

ఎంవివి తనయుని ఇంటి వద్ద గుమిగూడిన నేతలు, స్థానికులు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

**అంతా సినీ ఫక్కీలో పక్కాగా సాగిపోయింది. ఒక పార్లమెంట్ సభ్యునిపైనే రౌడీషీటర్ గురిపెట్టాడు. ఎంపీ కుటుంబ సభ్యులందరినీ ఒకచోటకు రప్పించి తన కల నెరవేర్చుకోవాలని చూసేలోపు సదరు ఎంపీ చాకచక్యంగా వ్యవహరించి పోలీసులకు సమాచారం ఇవ్వడంతో రౌడీషీటర్ స్కెచ్‌కు చెక్ పెట్టినట్టయింది. తాజాగా నగరంలో చోటుచేసుకున్న ఈ వ్యవహారంతో విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎంవివి.సత్యనారాయణ, ఆయన కుటుంబమే కాదు..యావత్ విశాఖ, ఆంధ్రప్రదేశ్ కూడా ఒక్కసారిగా ఉలిక్కిపడేటి సన్నివేశం గురువారం నగరంలో చోటుచేసుకుంది. భూములు - వ్యాపారాలు - ఆర్థిక వ్యవహారాల్లో ఆరితేరిపోయిన రియల్ ఎస్టేట్ ఆగడాలు ఎలా ఉంటాయనడానికి ఈ తాజా సంఘటన ఒక తార్కాణంగా చెప్పొచ్చు.**

రౌడీషీటర్‌గా పిలవబడే హేమంత్ 'రియల్ ఎస్టేట్' బడా వ్యాపారులునే లక్ష్యంగా చేసుకుంటూ పబ్బం గడుపుకుంటాడు. ఆయన చేసే ఈ అఘాయిత్యాలకు ఒక మహిళను కూడా వెంటపెట్టుకుని అవసరమైన చోట ఆమెను అడ్డం పెట్టుకుని ఆమె అకౌంట్లకు రూ.లక్షలు మళ్లిస్తాడన్న విమర్శలు విశాఖలో వినిపిస్తున్నాయి. తాజాగా సాక్షాత్తూ ఒక పార్లమెంట్ సభ్యుని కుటుంబాన్ని, ఆయన సన్నిహితులను టార్గెట్ మిగతా 2లో..

## డబ్బు కోసమే ఇదంతా : ఎంపీ ఎంవివి.సత్యనారాయణ

'డబ్బు కోసమే రౌడీ షీటర్ హేమంత్ నా భార్య, కుమారుడిని కిడ్నాప్ చేశాడు. నాపై కక్ష సాధింపు వ్యవహారాలు, రియల్ ఎస్టేట్, పార్టీ వ్యవహారాలుగానీ ఇందులో లేవు. ఆడిటర్ జివి ఫోన్ ఎత్తకపోవడంతో నాకు అనుమానం వచ్చింది. ఆ విషయాన్ని సిపి దృష్టికి తీసుకెళ్లాను. ఎటువంటి ప్రాణనష్టం లేకుండా వారిని పోలీసులు కాపాడారు. కిడ్నాపర్‌పై చర్యలు తీసుకోవాలి' అని ఎంపీ ఎంవివి.సత్యనారాయణ మీడియాకు తెలిపారు.

ధర్నాలో సిపిఎం జిల్లా కార్యదర్శి లోకనాథం, తదితరులు

# అదనపు విద్యుత్ భారాలు తగ్గించాలి

**సిపిఎం ఆధ్వర్యాన ట్రాన్స్‌కో కార్యాలయం ఎదుట ధర్నా**

**ప్రజాశక్తి-అనకాపల్లి :** ప్రజలపై ప్రభుత్వం వేసిన అదనపు విద్యుత్ భారాలను తగ్గించాలని, ట్రూఅప్ ఛార్జీలు రద్దు చేయాలని, స్మార్ట్ మీటర్ల ప్రతిపాదనన విరమించాలని కోరుతూ ఎపిఇపిడిసిఎల్ అనకాపల్లి డివిజనల్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ కార్యాలయం వద్ద గురువారం సిపిఎం ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా ప్రజలపై విద్యుత్ ఛార్జీలు పెంచి మోయలేని భారాలు వేస్తుందని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వ తీసుకున్న నిర్ణయాలతో సామాన్య ప్రజానీకం ఈ భారాలు తట్టుకోలేక విలవిల్లాడుతున్నారు. గృహ వినియోగదారుల కరెంట్ బిల్లులుకు అదనంగా ఫిక్స్ ఛార్జీలు, కష్టమర్ ఛార్జీలు, ఎలక్ట్రిసిటీ డ్యూటీ ఛార్జీలు, ట్రూఅప్ ఛార్జీలు, ఎఫ్‌పిసిఎ ఛార్జీల పేరుతో అనేక రకాలైన ఛార్జీలు వేసి తీవ్రమైన భారాలు మోపడం అన్యాయమన్నారు. వినియోగదారుల నుండి విద్యుత్ రెగ్యులేటరీ కమిషన్ ప్రతీ ఏడాది పెంచుతున్న ఛార్జీలకు అదనంగా ఛార్జీలు దొడ్డిదారిన బిల్లులలో వేస్తున్నారని పేర్కొన్నారు. ఇప్పటికే అన్ని రకాల నిత్యావసర సరుకుల ధరలు పెరిగి సతమతమౌతున్న ప్రజలపై అదరపు విద్యుత్ ఛార్జీలు వేయడం దారుణమన్నారు. ఇటీవల కాలంలో యూనిట్‌కు రూ.4 నుండి రూ.10 వరకు అదనంగా మిగతా 2లో..

## సమస్యలపై అంగన్‌వాడీల ఆందోళనలు

▶ వార్త 8లో..

## ప్రయివేటుకు స్పోర్ట్స్ ఎరీనా ధారాదత్తం

▶ వార్త 2లో..

## శ్రీశ్రీకి ఘన నివాళి

▶ వార్త 5లో..

# భారీగా రైళ్ల రద్దు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** కోరమండల్ రైలు ప్రమాదంతో దెబ్బతిన్న ఖరగ్‌పూర్ డివిజన్‌లోని ఖరగ్‌పూర్-భద్రక్ సెక్షన్ బహనాగ బజార్ స్టేషన్‌లో ట్రాక్ నిర్వహణ పనుల కారణంగా జూన్ 16న 18045 షాలిమార్-హైదరాబాద్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 18046 హైదరాబాద్ - షాలిమార్ ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్, 22807 సంత్రాగచ్చి - చెన్నై సెంట్రల్ ఎక్స్‌ప్రెస్, 07029 అగర్తల - సికింద్రాబాద్ ఎక్స్‌ప్రెస్, 22850 సికింద్రాబాద్ - షాలిమార్ ఎక్స్‌ప్రెస్, 22817 హౌరా - మైసూర్ ఎక్స్‌ప్రెస్ రైళ్లను, జూన్ 18న 22818 మైసూర్ - హౌరా ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేసినట్టు రైల్వే శాఖ సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ ఎకె.త్రిపాఠి తెలిపారు.

తాడి-అనకాపల్లి సెక్షన్ మధ్య గూడ్స్ రైలు పట్టాలు తప్పిన తర్వాత భద్రతా పనుల కారణంగానూ, దక్షిణ మధ్య రైల్వేలోని విజయవాడ డివిజన్‌లో ఇతర భద్రతా పనుల కారణంగానూ జూన్ 16వ తేదీ శుక్రవారం 12718 విజయవాడ - విశాఖపట్నం రత్నాచల్ సూపర్ ఫాస్ట్, 12717 విశాఖపట్నం - విజయవాడ రత్నాచల్ సూపర్ ఫాస్ట్, 17488 విశాఖపట్నం - కడప తిరుమల ఎక్స్‌ప్రెస్, 12727 విశాఖపట్నం-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, 12728 హైదరాబాద్-విశాఖపట్నం గోదావరి ఎక్స్‌ప్రెస్‌లు, 12861 విశాఖపట్నం-మహబూబ్‌నగర్ సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు, 12862 మహబూబ్‌నగర్-విశాఖపట్నం సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌లు, 12739 విశాఖపట్నం-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌లను రద్దు చేశారు. అలాగే 12740 సికింద్రాబాద్-విశాఖపట్నం గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్, 22708 తిరుపతి-విశాఖపట్నం డబుల్ డెక్కర్ ఎక్స్‌ప్రెస్, 17243 గుంటూరు-రాయగడ ఎక్స్‌ప్రెస్, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్ళను, 17వ తేదీన 12727 విశాఖపట్నం-హైదరాబాద్ గోదావరి ఎక్స్‌ప్రెస్, 17487 కడప-విశాఖపట్నం తిరుమల ఎక్స్‌ప్రెస్, 12862 మహబూబ్‌నగర్-విశాఖపట్నం మిగతా 2లో..

# ఇళ్ల నిర్మాణాలు జరిగేదెలా..!

◆ వీడని బాలారిష్టాలు ◆ వద్దన్న చోట లే అవుట్లు ◆ వెళ్లడానికి ఆసక్తి చూపని నిరుపేదలు

**ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి**

సంపత్‌పురం లే అవుట్ బదులు ప్రత్యామ్నాయ స్థలం చూస్తామన్నారు. కానీ స్థలం చూపించలేదు.

**- సూరిబాబు, అనకాపల్లి ఎంపిపి**

కొన్ని గ్రామాలకు నదికి అవతలవైపు, మరికొందరకి ఊరికి దూరంగా పట్టాలు ఇవ్వడంతో లబ్ధిదారులు ఇళ్ల కట్టుకోవడానికి ఆసక్తిచూపడంలేదు.

**- గిరిబాబు, గొలుగొండ జెడ్‌పిటిసి**

ఎదురువాడ పంచాయతీలో ఏడు గ్రామాల ప్రజలకు ఇళ్ల పట్టాలిచ్చారు. అటవీశాఖాధికారులు వెళ్లనీయకుండా అభ్యంతరం చెబుతున్నారు. ఇళ్లు కట్టుకొనే వీల్లేని కొండపక్కన లే అవుట్ వేశారు. రియల్ ఎస్టేట్ వ్యాపారి కొండను తవ్వేశాడు. చోడపల్లి, మోసయ్యపేట లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోవడానికి ముందుకు రావడంలేదు. ప్రత్యామ్నాయ స్థలం చూపించండి

**- లాలం రాము, అచ్యుతాపురం జెడ్‌పిటిసి**

ఊరికి దూరంగా ఉన్న లోవపాలెం లే అవుట్

మే 25న జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో అధికార పార్టీకి చెందిన వీరంతా ఇళ్లు కట్టుకోవడానికి లబ్ధిదారులు ఆసక్తిచూపనిచోట ఇళ్ల పట్టాలు, ఇళ్లు మంజూరు చేశారని వాపోయారు. ప్రత్యామ్నాయ స్థలాల్లో మిగతా 2లో..

## మొదటి పేజీ తరువాయి..

### ఇళ్ల నిర్మాణాలు జరిగేదెలా..!

లే అవుట్లు వేయాలని కోరారు. మరికొంతమంది కట్టుకున్న ఇళ్లకు బిల్లులు సరిగా రాకపోవడంతో లబ్ధిదారులు ఇళ్లు కట్టుకోలేకపోతున్నారని అన్నారు.

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న జగనన్న కాలనీలు, నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లనిర్మాణంలో బాలారిష్టాలు తొలగిపోలేదని వీరి ఆవేదన ద్వారా అర్థమవుతోంది. వాస్తవానికి క్షేత్రస్థాయిలో ఇదే పరిస్థితి వుండడంతో అర్హులైన ప్రతి పేదవానికీ పక్కా గృహాలు అందించాలన్న లక్ష్యం నీరుగారుతోంది. ఇంటి వాస్తవ నిర్మాణ విలువ కంటే ప్రభుత్వమిచ్చే ఇంటి నిర్మాణ విలువ తక్కువగా వుండడంతో ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించిన నిరుపేదలు పూర్తిచేసుకోలేక మధ్యలోనే నిలిపివేస్తున్నారు. ఇంకొందరు నిర్మాణాలు ప్రారంభించలేక వదిలేశారు.

జిల్లాలో నవరత్నాలు - పేదలందరికీ ఇళ్లు(ఎన్‌పిఐ) పథకం కింద దాదాపు 57,239 ఇళ్లు మంజూరయ్యాయి. 744 జగనన్న లే అవుట్‌లు, సొంతస్థలాల్లో ఇళ్లు నిర్మించుకోవడానికి ముందుకొచ్చిన పేదలు నిర్మాణ భారం పెరగడంతో పూర్తిచేయలేకపోతున్నారు. ప్రభుత్వం ఇంటికి రూ.1.80 లక్షలు ఇస్తుండగా, ఒక్కో ఇంటికి మూడు లక్షలకుపైగా ఖర్చవుతోంది. దీంతో ఇళ్ల నిర్మాణాలపై పేదలు ఆసక్తిచూపడంలేదు. గృహ నిర్మాణ సంస్థ అధికారులు నిర్దేశిత నిర్మాణ లక్ష్యాలు పూర్తిచేసేందుకు ఎంత ప్రయత్నించినా, ఇళ్ల నిర్మాణాల్లో ఆశించిన పురోగతి కనిపించడంలేదు. ఇంతవరకు 1541 మంది లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించలేదు. కట్టుకోలేని 4,800 ఇళ్లను ప్రభుత్వం రద్దు చేసింది. జులై నాటికి 15 వేల ఇళ్ల నిర్మాణాలను పూర్తిచేయాలని విధించిన లక్ష్యంలో జూన్ 14కు 11,800 వరకు పూర్తయ్యాయి. పునాదుల దశలో 10,900, బిబిఎల్ దశలో 23,700, స్లాబ్ స్థాయిలో 2,700, స్లాబ్ వేసినవి 1500 వున్నాయి. పునాదుల వరకు రూ.70 వేలు, స్లాబ్ లెవల్ వరకు రూ.50 వేలు, స్లాబ్‌కు రూ.30 వేలు, ఇళ్లు పూర్తయితే రూ.30 వేలు ప్రభుత్వం చెల్లించనుంది. అయితే ఇంటి నిర్మాణ స్థాయిలను బట్టి బిల్లులు రావడంలేదని లబ్ధిదారులు వాపోతున్నారు.

### ఎంపీ ఇంట కిడ్నాప్ కలకలం

చేసేంత వరకూ ఓ రౌడీషీటర్ వెళ్లాడు. విశాఖలో వ్యాపార సామ్రాజ్యాన్ని విస్తరించుకున్న పార్లమెంట్ సభ్యుడు ఎంవివి. సత్యనారాయణను రూ.కోట్లు కోసం కిడ్నాపర్ లక్ష్యంగా చేసుకున్నాడా ? అంటే ఔననే అనిపిస్తోంది. గతంలో కంటే ఎంవివి సత్యనారాయణ విశాఖ నగరం నడిబొడ్డున ఎంవివి పీక్, పిఎంపాలెం వద్ద ఎంవివి సిటీ నిర్మాణాలతో తన రియల్‌ఎస్టేట్ వ్యాపారాన్ని మరింత విస్తరించిన సంగతి తెలిసిందే.

**హేమంత్ మామూలోడు కాదు సుమా..**

ఎంపీ ఎంవివి సత్యనారాయణ కుమారుడు శరత్ చౌదరి రుషికొండలో నివాసం ఉంటున్న వ్యవహారంపై రౌడీషీటర్ కోలా వెంకట హేమంత్ కన్నేశాడు. గడిచిన 15 రోజులుగా ఆ ఇంటికి వచ్చిపోయే వారిపై నిఘా పెట్టాడు. రూ.50 కోట్లు ఎంపీ ఎంవివి నుంచి గుంజుకోవాలని ఈ కిడ్నాప్‌కు పాల్పడినట్లు ప్రచారం సాగుతోంది. విశాఖ నగర పోలీస్ కమిషనర్ చెప్పిన ప్రకారం రూ.కోటి డిమాండ్ చేశాడని తెలుస్తోంది. అయితే గతంలోనే సదరు రౌడీషీటర్ హేమంత్ రూ.కోటి డిమాండ్ చేయగా, 2023లో ఇంత తక్కువ డిమాండ్ చేస్తాడా ? పైగా ఎంపీ ఎంవివి నుంచి అన్నది చర్చసాగుతోంది. ఇదిలా వుండగా, గతంలో ఈ హేమంత్‌పై మర్డర్, ఛీటింగ్ కేసులు ఉన్నాయి. పిఎం.పాలెం స్టేషన్‌లో రౌడీ షీట్ ఉంది. ఇదివరకూ 2019లో జరిగిన ఓ ఉదంతాన్ని చూస్తే.. రుషికొండలోని ఓ ప్రైవేట్ హోటల్‌కు రియల్ ఎస్టేట్ వ్యాపారి పాసి రామకృష్ణను సదరు హేమంత్ పిలిపించుకుని కిడ్నాప్ చేశాడు. బలవంతంగా ఒక వాహనంలో ఎక్కించి రూ.కోటి ఇవ్వాలని డిమాండ్ చేశాడు. ప్రాణభయంతో సదరు వ్యక్తి రూ.50 లక్షలు ఇస్తానని ఒప్పుకున్నట్లు తెలుస్తోంది. ఈలోగా హేమంత్ ప్రవర్తనను ప్రత్యక్షంగా చూసిన ఆ హోటల్ యాజమాన్యం ఆయన తీరుపై అనుమానంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది. కారులో హోటల్ నుంచి రామకృష్ణను తీసుకెళ్లాడన్న విషయాన్ని పిఎం.పాలెం పోలీసులకు వివరించింది. దీంతో సిసి కెమెరాలో అప్పట్లో ఈ దృశ్యాలను చూసిన పోలీసులు సదరు హేమంత్ కోసం గాలించారు. ఏ వాహనంలోనైతే వెళ్లారో ఆ డ్రైవర్ సాయంతోనే కిడ్నాపర్‌ను పట్టుకున్నారు. ఈ సమయంలో పోలీసులు వెంబడిస్తున్న విషయం తెలుసుకున్న హేమంత్ కారు డ్రైవర్, రామకృష్ణను విజయనగరం సమీపంలో దింపేసి పరారైపోయాడు. జరిగిందంతా రామకృష్ణ పిఎం.పాలెం పోలీసులకు వివరించారు. ఆ తర్వాత హేమంత్‌ను పట్టుకుని పోలీసులు కేసు నమోదు చేశారు. ఇలా పలు మోసాలకు ఆద్యుడుగా హేమంత్ ఉండి.. పట్టుబడి.. జైలుకెళ్లి బయటకొచ్చాడు. తాజాగా ఎంవివిని లక్ష్యం చేసుకుని పోలీసులకు మరోసారి చిక్కాడు.

### తర్లువాడ సమీపంలో చిక్కిన కిడ్నాపర్లు

**ప్రజాశక్తి - ఆనందపురం, పద్మనాభం :** విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ భార్య, కుమారుడును, ఆడిటర్ జివిని కిడ్నాప్ చేసి, డబ్బులు డిమాండ్ చేసి పరారవుతున్న నిందితులను ఆనందపురం మండలం తర్లువాడ ఐటిబిపి సమీపాన పోలీసులు వెంబడించి పట్టుకున్నారు. ఆ సమయంలో పెట్రోలింగ్ వ్యాన్‌తో కిడ్నాపర్ల కారును వెంబడించి బలంగా ఢీకొనడంతో కారు బోల్తాపడింది.

ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న కిడ్నాపర్లు హేమంత్ కుమార్, రాజేష్ సమీపంలో ఉన్న తోటల్లోకి పారిపోవడానికి ప్రయత్నించగా పొలాల్లో సర్వే నిర్వహిస్తున్న కొంతమంది రైతులు పోలీసుల కేకలు విని పారిపోతున్న వారిని పట్టుకుని పోలీసులకు అప్పగించారు. నిందితులను పట్టుకోవడంలో సిఐలు రామచంద్రరావు, ఎన్.సన్యాసినాయుడు చాకచక్యంగా వ్యవహరించారు.

# ప్రయివేటుకు స్పోర్ట్స్ ఎరీనా ధారాదత్తం

**విచ్చలవిడిగా ఫీజుల వసూలు**
**జివిఎంసి కౌన్సిల్‌ను డమ్మీ చేసిన వైసిపి ప్రభుత్వం**
**సిపిఎం ఫ్లోర్ లీడర్ డాక్టర్ బి.గంగారావు**

మాట్లాడుతున్న గంగారావు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ**

స్మార్ట్ సిటీ ప్రాజెక్టు కింద ఎంవిపి.కాలనీలోని ఎఎస్.రాజా కాలేజీ గ్రౌండ్ పక్కన ఎకరా పది సెంట్లు విస్తీర్ణంలో రూ.25 కోట్లతో నిర్మించిన మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనాను సహానీ అనే ప్రయివేటు సంస్థకు జివిఎంసి కట్టబెట్టడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్టు సిపిఎం ఫ్లోర్ లీడర్, జివిఎంసి 78వ వార్డు కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు తెలిపారు. మద్దిలపాలెంలోని పార్టీ కార్యాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజల ఆస్తులను ప్రయివేటు సంస్థలకు దోచిపెట్టే నిర్ణయాలను ఉపసంహరించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇండోర్ స్పోర్ట్స్‌ను ప్రయివేటు సంస్థకు ఇవ్వకుండా, దీని నిర్వహణ బాధ్యతను జివిఎంసి చూడాలని సిపిఎం కోరుతోందన్నారు. ఫీజుల వసూళ్లపై కనీస నియంత్రణలేకుండా కౌన్సిల్‌ను అచేతనంగా మార్చిన వైసిపి పాలకవర్గ చర్యలను ఖండించారు. ఎరీనాను గత నెలలో ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రారంభించారని, సెంట్రల్ ఎసితో కూడిన ఈ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో నాలుగు బ్యాడ్మింటన్ కోర్టులు, రెండు స్విమ్మింగ్ పూల్స్, బాస్కెట్‌బాల్ కోర్టులు, వాలీబాల్ కోర్టు, రెండు టేబుల్ టెన్నిస్ కోర్టులు, వాకింగ్ ట్రాక్, ఓపెన్ జిమ్నాజియం, డార్మెంటరీస్, బోర్డు గేమ్ రూమ్స్ తదితర అనేక రకాల క్రీడా సదుపాయాలున్నాయన్నారు. ఇలాంటి ఎరీనాను ప్రజలు వినియోగించుకొనే అవకాశం లేకుండా ప్రయివేటు సంస్థకు జివిఎంపి అప్పగించడం దారుణమన్నారు.

స్విమ్మింగ్‌పూల్‌కు నెలకు రూ.4 వేలు, బ్యాడ్మింటన్‌కు రూ.4 వేలు, వాలీబాల్‌కు రూ.5 వేలు, టేబుల్ టెన్నిస్‌కు రూ.2,500, చెస్‌కు రూ.1500, యోగాకు రూ.2 వేలు, ఆదివారం రోజున బ్యాడ్మింటన్‌కు ప్రతి గంటకూ వెయ్యి రూపాయలు, జిమ్‌క్రాస్ ఫిట్ ట్రైనింగ్‌కు ఎనిమిది వేలు చొప్పున ప్రయివేటు సంస్థ వసూలు చేస్తోందన్నారు. అదనంగా 18 శాతం జిఎస్‌టి చెల్లించాల్సి ఉందన్నారు. రాబోయే కాలంలో ఈ ధరలను మరింత పెంచనుందని తెలిపారు. ఈ ఫీజులు నిర్ణయంలోనూ, ధరల నియంత్రణలోనూ జివిఎంసికి అధికారంలేకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిందన్నారు. విచ్చలవిడిగా డబ్బులు దోచుకొనే అవకాశం ప్రయివేటు సంస్థకు కల్పించినట్టు తెలిపారు. నామమాత్రంగా ఏడాదికి కేవలం కోటీ నాలుగు లక్షలు మాత్రమే చెల్లించి, స్పోర్ట్స్ కాంపెక్స్‌లో క్రీడా శిక్షణ పేర అనేక వ్యాపార కార్యక్రమాలు నిర్వహించుకొనే అవకాశమిచ్చిందన్నారు. నిబంధనలేవీ పాటించకుండా సహానీ సంస్థకు ఇండోర్ స్పోర్ట్స్‌ను ఐదేళ్ల లీజుకు ఇచ్చినట్టు చెప్పారు. సహానీ కల్పిత సంస్థగా కనిపిస్తోందని, టెండర్లలో ఈ ఒక సంస్థనే పాల్గొన్నా, రద్దు చేయకుండా ఆ సంస్థకు ఆగమేఘాలపై అప్పగించించిన విషయాన్ని గుర్తుచేశారు. దీని వెనుక జరిగిన భారీ అవినీతిలో రాష్ట్ర ప్రభుత్వ పెద్దల హస్తం వున్నట్లు తెలుస్తోందన్నారు. సహానీ లాభాల కోసం ప్రజల ఆస్తులను సర్కారు నిస్సిగ్గుగా ఫణంగా పెట్టిందన్నారు. లీజు ఒప్పంద పత్రాన్ని బహిర్గతం చేయలేదన్నారు. ప్రజల సొమ్ముతో నిర్మించిన ఈ ఎరీనాలోకి కొద్దిమంది సంపన్నులకు తప్ప సామాన్యులెవరికి ప్రవేశంలేదని తెలిపారు. అలాగే ఇండోర్ స్పోర్ట్స్ ఎరీనా ప్రయివేటీకరణను జివిఎంసి కౌన్సిల్ అజెండాలో పెట్టలేదన్నారు. విశాఖ స్మార్ట్ సిటీ కార్పొరేషన్ ముసుగులో ప్రయివేటు సంస్థకు అప్పగించినట్టు తెలిపారు. స్మార్ట్ సిటీ నిధులతో చేపట్టిన ప్రాజెక్టులన్నింటినీ ప్రయివేటుపరం చేస్తున్నారని, జివిఎంసి కౌన్సిల్‌ను డమ్మీగా మార్చేశారని అన్నారు. ఆర్‌కె బీచ్, గాజువాకలోని స్విమ్మింగ్‌పూల్‌ను కోవిడ్ పేర మూసేశారన్నారు. వీటిని ప్రారంభించాలని చేస్తున్న విజ్ఞప్తులను పక్కనబెట్టి ప్రయివేటీకరించాలన్న ఆలోచనలో జివిఎంసి ఉన్నట్టు తెలిపారు. ప్రజల నుంచి పలు రూపాల్లో పన్నులు వసూలు చేస్తున్న జివిఎంసి ప్రజలకు తగిన క్రీడా సదుపాయాలు కల్పించడంలేదన్నారు. నాలుగు వేల కోట్ల జివిఎంసి బడ్జెట్‌లో నాలుగు కోట్లు కూడా ఖర్చు చేయడం లేదని తెలిపారు. గాజువాక, కంచరపాలెం, అనకాపల్లి, పెందుర్తి, మధురవాడ, మల్కాపురం తదితర ప్రాంతాల్లో క్రీడా సదుపాయాలు కల్పించకుండా నిర్లక్ష్యం ప్రదర్శిస్తోందన్నారు.

### ఎల్‌ఐసి స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్‌గా శర్మ

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఎల్‌ఐసి స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డు మెంబర్‌గా నగరానికి చెందిన డాక్టర్ డివిఎస్‌వై.శర్మ నియమితులయ్యారు. ఎల్‌ఐసి విశాఖ డివిజన్‌లో హెచ్‌ఐఎగా పనిచేస్తున్న శర్మ అంతర్జాతీయ టేబుల్ టెన్నిస్ రిఫరీగా, జాతీయ చెస్ ఆర్బిటర్‌గా సేవలందిస్తున్నారు. అలాగే, జిల్లా టేబుల్ టెన్నిస్ సంఘం కార్యదర్శిగానూ, రాష్ట్ర సంఘం సంయుక్తగా కార్యదర్శిగానూ ఉన్నారు.

ఎల్‌ఐసి స్పోర్ట్సు ప్రమోషన్ బోర్డు మెంబర్‌గా నియమితులైన నేపథ్యంలో శర్మను ఎల్‌ఐసి క్లబ్‌లో జరిగిన కార్యక్రమంలో పలువురు సన్మానించారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, మేనేజర్ పర్సనల్ భగవాన్ ప్రసాద్ మాట్లాడుతూ శర్మ స్పోర్ట్స్ ప్రమోషన్ బోర్డుకు ఎంపిక కావడం విశాఖ డివిజన్‌కు గర్వ కారణమని అన్నారు. రెండేళ్లపాటు కొనసాగే ఈ పదవిలో ఎల్‌ఐసిలో క్రీడల అభివృద్ధికి మరింత కృషి చేస్తారని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎం.కామేశ్వరి, వరప్రసాద్, ఉమెన్స్ కన్వీనర్ జి.సూర్య ప్రభ, ఎవిఆర్‌కె. మూర్తి, సతీష్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అదనపు విద్యుత్ భారాలు తగ్గించాలి

(మొదటి పేజీ తరువాయి..) ఈ ఛార్జీలు వేసిందని తెలిపారు. సిపిఎం మండల కార్యదర్శి గంటా శ్రీరామ్ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ప్రైవేటు విద్యుత్ సంస్థలకు లబ్ధి చేకూర్చే విధంగా ఒప్పందాలు చేసుకుని ప్రైవేటు విద్యుత్ సంస్థలకు లబ్ధి చేకూర్చేందుకు ప్రజలపై ఈ భారాలు మోపడాన్ని తీవ్ర ఖండిస్తున్నామన్నారు. సిపిఎం సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ మాట్లాడుతూప్రజలపై అదనపు ఛార్జీలు వసూలు ఆపకపోతే మరో విద్యుత్ పోరాటం చేయక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వివి.శ్రీనివాసరావు, నాయకులు బుగిడి నూక అప్పారావు, కె.ఈశ్వరరావు, ఆళ్ళ మహేశ్వర రావు, జి.సుభాషిణి. ఎ.వరలక్ష్మి, భీశెట్టి అప్పారావు, కాపుశెట్టి అప్పారావు, గైపూరి నరసింగరావు, సురేష్, రాజు, బిందెలు అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

### భారీగా రైళ్ల రద్దు

(మొదటి పేజీ తరువాయి..) సూపర్ ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్‌ను, 12739 విశాఖపట్నం-సికింద్రాబాద్ గరీబ్‌రథ్ ఎక్స్‌ప్రెస్‌ను, 17244 రాయగడ - గుంటూరు ఎక్స్‌ప్రెస్ రైళ్లను రద్దు చేశారు. 20833 విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలు ఈనెల 16 ఉదయం 5:45 నిమిషాలకు బదులు 4 గంటలు ఆలస్యంగా 9:45 నిమిషాలకు బయలుదేరుతుందని అధికారులు తెలిపారు

**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.**
**O.S.No.2552 of 2020**

**Between:**
Union Bank of India,
[A Govt. of India undertaking]
[formerly]Andra Bank rep.by its Manager,
Credit Card Division Head Office, Koti,
Sultan Bazar, Hyderabad.
**...Plaintiff.**

**And**

Mr.G. Kasi Babu, S/o Mr.G.Neelayya,
Aged about 47yrs, Occ: Business,
D.no.6-101, Opp: PHRC gate, Poduru,
Vishakapatnam.
**.Defendant**

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 2552 of 2020 on the file of Hon'ble XXI Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 1,77,066.30 pertaining to your credit card no ending with -6007. You are therefore directed to appear in person or through Advocate on 6.7.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

**[AS PER THE COURT ORDER]**
**M.V.Nagaraj.**
**V.V.S.Annaram**
**Counsel for Plaintiffs.**
**H.No. 1-1-336/18,**
**Chikkadapalli,Hyderabad.**
**Cell:98496-66587**

**IN THE COURT OF THE HON'BLE XXI JUNIOR CIVIL JUDGE; CITY CIVIL COURT AT HYDERABAD.**
**O.S.No.2903 of 2020**

**Between:**
Union Bank of India,
[A Govt. of India undertaking]
[formerly]Andra Bank rep.by its Manager,
Credit Card Division Head Office, Koti,
Sultan Bazar, Hyderabad.
**...Plaintiff.**

**And**

Mr. M.Ramakrishna, S/o Mr. M.Massenu,
Aged about 48yrs, Occ: Employee,
PSU HIG-I/53, Nadupudi P.O, B.C.Road,
Vikasnagar, New Gajuvaka,
Vishakapatnam - 5300026.
Or
Mr. M.Ramakrishna, S/o Mr. M.Massenu,
Kalasi, Vishakapatnam Steel Project,
Vishakapatnam – 530031.
**.Defendant**

Whereas the above named Plaintiff has filed the above suit O.S.No 2903 of 2020 on the file of Hon'ble XXI Junior Civil Judge, City Civil Court, Hyderabad against you for recovery of due amount of Rs. 4,91,390.24 pertaining to your credit card no ending with -2001. You are therefore directed to appear in person or through Advocate on 7.7.23 at 10.30a.m. to answer the suit, failing which the suit will be decided exparte. Take notice accordingly.

**[AS PER THE COURT ORDER]**
**M.V.Nagaraj.**
**V.V.S.Annaram**
**Counsel for Plaintiffs.**
**H.No. 1-1-336/18,**
**Chikkadapalli,Hyderabad.**
**Cell:98496-66587**

## అలరించిన సినీ సంగీత విభావరి

**ప్రజాశక్తి- సీతమ్మధార :** ద్వారకానగర్ పౌర గ్రంధాలయంలో గురువారం సాయంత్రం వివిఎం గోపాలరావు స్థాపించిన శివసాయి సాంస్కృతిక సినీ సంగీతసంస్థ ఆధ్వర్యంలో 'నన్ను వదలి నీవు పోలేవులే' పేరుతో సినీ సంగీత విభావరి నిర్వహించారు. బంగారరాజు, వాసంతి పాడిన చిలిపి కనుల తీయని, మహ్మద్‌ఖాన్, రోహిణి పాడిన ఎక్కడఎక్కడ, మహాదేవమూర్తి, శ్వేత ఆలపించిన విన్నవించుకోనా, ఎస్ఎస్ఎన్ రాజు, మను పల్లాతో నువ్వంటే నాకిష్టమని, హేమంత్ కుమార్ పాడిన సిరిమల్లె నీవే, బొమ్మిడి సత్యనారాయణ, సాత్విక గొంతు నుంచి జాలువారిన నాటు కొట్టుడు, దంచుకొట్టుడు, గోపాలరావు, బయ్యవరపు రాధ పాడిన టైటిల్‌సాంగ్ సంగీత ప్రియులను ఓలలాడించాయి తొలుత ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు చెన్నా తిరుమలరావు జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. . నన్నపనేని మల్లికా చౌదరి వ్యాఖ్యానం చేసిన కార్యక్రమంలో ప్రముఖ వ్యాఖ్యాత పి. రాజేంద్రప్రసాద్, వివిధ కళా సంస్థల ప్రతినిధులు వెంకటేష్ మాస్టర్, జెఎంఆర్ నెహ్రూ, రమణ మూర్తి పాల్గొన్నారు.

## 18 నుంచి దుర్గాదేవి జాతర

వాల్‌పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగిరెడ్డి

**ప్రజాశక్తి గాజువాక.:** జివిఎంసి 65వ వార్డు, కాకతీయలోవ గ్రామ ఆరాధ్యదైవం శ్రీదుర్గాదేవి అమ్మవారి జాతర ఈనెల 18 నుంచి 20 వరకు మూడురోజుల పాటు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు. ఈ మేరకు జాతర వాల్‌పోస్టర్లను గురువారం ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, వార్డు కార్పొరేటర్ బొడ్డు నరసింహపాత్రుడు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, ఏటా ఆనవాయితీగా నిర్వహించే ఈ వేడుకలను ప్రజలంతా ఐకమత్యంతో నిర్వహించి, విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. తనవంతు సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో 64వ వార్డు వైసిపి ఇన్‌ఛార్జి ధర్మాల శ్రీనివాస్, వార్డు నాయకులు మద్దాల అప్పారావు, నాగిశెట్టి శ్రీనివాస్, మొదలవలస లోకనాథరావు, బైపిల్లి గాంధీ, ఇరోతి గణేష్, గొల్లపల్లి లక్ష్మీపుష్ప, మంగునాయుడు, మణికంఠ, పెంట్ర రాజు, అర్జున్ పాల్గొన్నారు.

## పిల్లలకు పౌష్టికాహారం అవసరం

మాట్లాడుతున్న కార్పొరేటర్ గోవింద

**ప్రజాశక్తి- సీతమ్మధార :** పిల్లల శారీరక, మానసిక వికాసానికి పౌష్టిక విలువలతో కూడిన ఆహారం ఎంతో అవసరమని జివిఎంసి స్టాండింగ్ కమిటీ సభ్యుడు, 25వ వార్డు వైసిపి కార్పొరేటర్ సారిపల్లి గోవిందు అన్నారు. గురువారం మధురానగర్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో జన్‌భాగీధారిపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు పౌష్టికాహారంతోపాటు పూర్వ ప్రాథమిక విద్యను అందించాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశ పెట్టిందన్నారు. ఆటపాటలతో విద్యతోపాటు పౌష్టికాహారాన్ని అందించి, పిల్లలను రెగ్యులర్ చదువులకు సన్నద్ధం చేసేందుకు అంగన్వాడీ కేంద్రాల్లో ఈ పథకాన్ని అమలు చేస్తారని, ప్రతిఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపిడిఒ దుర్గాప్రసాద్, మధురానగర్ పాఠశాల హెచ్‌ఎం శాంతి కుమారి, అంగన్వాడీ సూపర్‌వైజర్ ఇందిర, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు, మహిళా పోలీసులు, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు, పిల్లలు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాల్లో / ఎయు అద్వితీయ ప్రగతి

**- ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్స్‌లో 15వ స్థానం**

**- ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో ఫోర్ స్టార్ రేటింగ్**

మాట్లాడుతున్న విసి ప్రసాదరెడ్డి, రిజిస్ట్రార్ కృష్ణమోహన్

**ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ :** స్టార్టప్, ఇంక్యుబేషన్ రంగాలలో ఆంధ్రవిశ్వవిద్యాలయం అద్వితీయ ప్రగతి సాధిస్తోందని ఎయు విసి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి అన్నారు. గురువారం ఎయు సెనేట్ మందిరంలో మీడియాతో మాట్లాడుతూ, ప్రారంభించిన తొలి ఏడాది కాలంలోనే కేంద్ర విద్యామంత్రిత్వ శాఖ విడుదల చేసిన ఎన్ఐఆర్ఎఫ్ ఇన్నోవేషన్ ర్యాంకింగ్‌లో జాతీయస్థాయిలో ఎయు 15వ స్థానంలో నిలచిందన్నారు. అదే విధంగా ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో తొలి సంవత్సరమే ఫోర్ స్టార్ రేటింగ్‌ను సొంతం చేసుకుందన్నారు. దేశ వ్యాప్తంగా కేవలం ఐదు సంస్థలు మాత్రమే ఫోర్‌స్టార్ రేటింగ్‌ను సాధించాయని, వాటిలో ఎయు ఒకటి కావడం గర్వకారణమన్నారు. జాతీయ విద్యా సంస్థలైన ఐఐటిలతో పోటీ పడుతూ ఎయు ఇంక్యుబేషన్, స్టార్టప్ సెంటర్ పనిచేస్తోందన్నారు. 2024 చివరి నాటికి ఎయులో 200పైగా సంస్థలు పనిచేయడం, నెలకొల్పడం లక్ష్యంగా పనిచేస్తున్నామని, ఇప్పటికే వందకు పైగా స్టార్టప్ సంస్థలు ఎయు కేంద్రంగా పనిచేస్తున్నాయన్నారు. విశాఖ నగరాన్ని ఎకనామిక్ జోన్‌గా తీర్చిదిద్దే సత్తా ఎయులో నెలకొల్పే స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్‌లకు ఉంటుందన్నారు. ఉత్తరాంధ్ర జిల్లాల యువతలోని నవ్య ఆలోచనలకు ప్రోత్సహిస్తూ, మార్గనిర్దేశం చేస్తూ వారిని పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దడానికి కృషిచేస్తామన్నారు.

విద్య, వైద్య, రక్షణ, బ్యాకింగ్ రంగాలకు ఉపయుక్తంగా ఎఐ ఆధారిత చిప్‌ను అభివృద్ధి చేయడం, ఉత్పత్తి చేసే దిశగా ఎయులో ప్రారంభించిన సేండ్ లాజిక్ సంస్థ పనిచేస్తోందన్నారు. సంస్థ నిర్వాహకులు డి.కమలాకర్, రవికుమార్‌లను పరిచయం చేసారు. ఎయు నుంచి వచ్చిన గ్రీన్ జామ్స్ సంస్థ పర్యావరణ హిత ఇటుకలను తయారీ విధానం వివరించి, సంస్థ నిర్వాహకులు తరుణ్ జామిని పరిచయం చేసారు. దేశం నుంచి ప్యారిస్ పీస్ ఫౌండేషన్‌తో కలసి పనిచేసే అవకాశం సాధించిన నాలుగో సంస్థగా ఎయులో స్థాపించిన తారామండల్ నిలుస్తుందన్నారు. సంస్థ వ్యవస్థాపకుడు వినీల్ జడ్సన్‌ను పరిచయం చేసారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్, ఏయూ ఇంక్యుబేషన్ సెంటర్ సిఇఒ రవి ఈశ్వరపు మాట్లాడారు.

## ప్రమాదాల్లో సహాయక చర్యలపై మాక్ డ్రిల్

**ప్రజాశక్తి-ఉక్కునగరం :** అత్యవసర సమయాల్లో పాటించే భద్రతాచర్యలపై విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో ప్లాంట్ లెవెల్ నైట్ టైం మాక్ డ్రిల్ నిర్వహించారు. జాయింట్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ జి శివశంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్లాంట్ యుటిలిటీస్ విభాగంలో ఎయిర్సెల్ యూనిట్లో ట్యాంక్ నుండి నైట్రోజన్ లీకేజీ అత్యవసర పరిస్థితుల్ని ఎదుర్కోవడం వంటి అంశాలపై కార్మికులకు అవగాహన కల్పించారు. విధి నిర్వహణలో కాలిన గాయాలు, ఊపిరి ఆడకపోవడం వంటి సమస్యలు కృత్రిమంగా సృష్టించి, వాటిని ఎదుర్కోవడంపై అవగాహన కల్పించారు. ఉద్యోగులు పెద్దగా కేకలు వేయటం, కంట్రోలర్ వెంటనే స్పందించి చర్యలు చేపట్టడం, ఆ విభాగ ఉద్యోగులతో పాటు సిఐఎస్ఎఫ్, ఫైర్ సెక్యూరిటీ, మెడికల్ సర్వీసెస్, గ్యాస్ సేఫ్టీ విభాగం, ఎన్విరాన్మెంట్ మేనేజ్మెంట్ సహ పలు స్టీల్‌ప్లాంట్‌లోని విభాగాలు అత్యవసర పరిస్థితిపై

సూచనలు చేస్తున్న శివశంకర్‌రెడ్డి

స్పందించి, నియంత్రణ చర్యలు చేపట్టడం, బాధిత సిబ్బందిని రక్షించడం వంటి చర్యలను మాక్‌డ్రిల్ చేసి చూపించారు. మొబైల్ అగ్నిమాపక శకటాలు, వాటర్ పంపింగ్ వ్యవస్థ, ప్రథమ చికిత్స, రెస్క్యూ పరికరాలు మొదలైనవి అత్యవసర సమయాల్లో స్పందించిన తీరును శివశంకర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు.

## కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ప్రిన్సిపల్ డాక్టర్ మంజుల

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** స్థానిక ఎస్‌విఎల్‌ఎన్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు గురువారం కెరీర్ గైడెన్స్, పోటీ పరీక్షలకు సన్నద్ధతపై అవగాహన కల్పించారు. జెకెసి, ఇండియన్ అకాడమీ ఫర్ కాంపిటీటివ్ ఎగ్జామినేషన్స్ (ఐఎసిఇ) ఆధ్వర్యంలో మూడురోజుల పాటు నిర్వహించనున్న సదస్సునుద్దేశించి కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ మంజుల మాట్లాడుతూ, పోటీ పరీక్షలకు సక్రమమైన ప్రణాళికతో నిరంతరం సాధన చేస్తే ప్రభుత్వ ఉద్యోగం సాధించగలరన్నారు.

ఐఎసిఇకి చెందిన ట్రైనర్ సంతోష్‌కుమార్ మాట్లాడుతూ, టెన్త్, ఇంటర్, డిగ్రీ తర్వాత ఉండే ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలను వివరించారు, ఈ సందర్భంగా ఐఎసిఇ సంస్థతో కళాశాల అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఐక్యూఎసి కో ఆర్డినేటర్ మాధురి, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు

## 18న ఎఐవైఎఫ్ జిల్లా మహాసభ

**ప్రజాశక్తి - ఆరిలోవ :** ఈ నెల 18న జరగబోవు అఖిల భారత యువజన సమాఖ్య 11వ జిల్లా మహా సభలను జయప్రదం చేయాలని ఆరిలోవ ఎఐవైఎఫ్ కమిటీ విజ్ఞప్తి చేసింది. గురువారం ఆరిలోవ దుర్గాబజార్ వద్ద దీనికి సంబంధించిన గోడపత్రికను ఆవిష్కరించారు. ఎఐవైఎఫ్ జిల్లా కన్వీనర్ వై.రాంబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యంత కీలకమైన విశాఖ నగరాన్ని ఉపాధి అవకాశాలకు కేంద్రంగా మార్చుకోవటంలో రాష్ట్ర ప్రభుత్వం వైఫల్యం చెందిందని విమర్శించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న యువజన వ్యతిరేక విధానాలను ప్రతిఘటిస్తూ విశాఖ జిల్లా కేంద్రంగా సమర్థశీల ఉద్యమాలకు సమాయత్తం చేసేందుకు నిర్వహించే మహాసభల్లో పెద్దఎత్తున యువత పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. అనంతరం మహాసభలను జయప్రదం చేయాలని కోరుతూ కరపత్రాలను పంపిణీ చేసారు. కార్యక్రమంలో ఆరిలోవ కమిటీ సెక్రటరీ చరన్, పవన్, సంజు, వెంకటేష్ పాల్గొన్నారు.

## నేరాలు ఘోరాలు

## రూ.10 కోట్లకు కుచ్చుటోపీ!

### -పోలీసులను ఆశ్రయించిన చిట్టీల బాధితులు

**ప్రజాశక్తి- పెందుర్తి:** చీటీల పేరుతో జనాలకు రూ.10 కోట్ల మేర కుచ్చుటోపీ పెట్టి ఉడాయించిన ఉదంతం పెందుర్తిలో వెలుగు చూసింది. బాధితుల కథనం ప్రకారం జివిఎంసి 96వ వార్డులో ఓ రాజకీయ నాయకుని సతీమణి లాలం గోవిందమ్మ చీటీలు వేశారు. పెద్ద మొత్తంలో చీటీలు వేసిన ఆమె తిరిగి బాధితులకు డబ్బులు చెల్లించకుండా కాలయాపన చేస్తూ వస్తున్నారు. ఎన్నిసార్లు అడుగుతున్నా ఇదిగో, అదిగో అంటూ కాలయాపన చేస్తూ రెండేళ్లు గడిపేశారు.

ఎప్పటికీ డబ్బులు ఇవ్వకపోవడంతో పాటు ప్రశ్నించిన వారిపై దౌర్జన్యానికి పాల్పడుతుండడంతో ఎట్టకేలకు పలువురు బాధితులు పెందుర్తి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. మరోవైపు తనపైనే కొందరు దౌర్జన్యం చేశారంటూ గోవిందమ్మ కూడా పోలీసులకు ఫిర్యాదు చేశారు.

## రూ.8 లక్షల విలువైన సెల్ ఫోన్లు స్వాధీనం

వివరాలను వెల్లడిస్తున్న సిఐ రమణయ్య

**ప్రజాశక్తి -నర్సీపట్నం రూరల్:** విశాఖ జిల్లా గాజువాకలో ఉన్న షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీలో పనిచేస్తూ దొంగిలించిన రూ. 8 లక్షల 8వేల విలువైన 30 సెల్ ఫోన్స్, నాలుగు స్మార్ట్ వాచ్, నోట్ ప్యాడ్, లాప్ టాప్ చోరీ సొత్తును స్వాధీనం చేసుకొని నలుగురు నిందితులను అరెస్టు చేసినట్లు నర్సీపట్నం రూరల్ సిఐ పి.రమణయ్య తెలిపారు. నర్సీపట్నం రూరల్ పోలీస్ స్టేషన్‌లో గురువారం విలేకర్లతో మాట్లాడుతూ, నాతవరం మండలం శృంగవరం గ్రామానికి చెందిన కాళ్ల అది సత్యనారాయణ, సుర్ల వరప్రసాద్, గాజువాక పెదగంట్యాడకు చెందిన గుడె కిరణ్, పల్లేటి అనిల్‌లను అరెస్టు చేశామన్నారు. షాడో ఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ ఆంధ్ర తెలంగాణా ఫ్రాడ్ ఇన్విస్టికేషన్ టీమ్ మేనేజర్ ప్రదీప్ రెడ్డి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నాతవరం ఎస్సై లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో దర్యాప్తు చేశారన్నారు. షాడోఫ్యాక్స్ లాజిస్టిక్ కంపెనీ నుంచి పెద్ద ఎత్తున అమెజాన్, ఫ్లిప్ కార్డ్ నుండి కస్టమర్ డెలివరీకి వచ్చిన సామగ్రి చోరీ జరుగుతున్న విషయాన్ని కంపెనీ ఫ్రాడ్ ఇన్విస్టికేషన్ టీమ్ గుర్తించిందన్నారు. కంపెనీలో పనిచేస్తున్న శృంగవరం గ్రామానికి చెందిన ఆదిసత్యనారాయణ కంపెనీ సిసి కెమెరాలను ఆప్ చేసి సామగ్రిని దొంగిలించినట్లు గుర్తించామన్నారు. ఎస్సై లక్ష్మీనారాయణ ఈ మేరకు సెల్ ఫోన్స్, స్మార్ట్ వాచ్ లు, ఇతర సామగ్రిని స్వాధీనం చేసుకొని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

## పుష్కరిణిలో మృతి చెందిన చేపల తొలగింపు

### 'ప్రజాశక్తి'కథనానికి దేవస్థానం అధికారుల స్పందన

పుష్కరిణిలో చేపలను తొలగిస్తున్న సిబ్బంది

**ప్రజాశక్తి-సింహాచలం:** సింహాచల దేవస్థానానికి చెందిన పవిత్ర పుణ్యక్షేత్రం వరాహ పుష్కరిణిలో మృతి చెందిన చేపలను తొలగించే పనులను దేవస్థానం అధికారులు చేపట్టారు. వరాహ పుష్కరిణిలో చేవల మృతి శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. గురువారం ఉదయం హుటాహుటిన పుష్కరిణి వద్దకు చేరుకుని, పుష్కరిణిలో లెక్కకుమిక్కిలిగా చనిపోయిన చేపలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. దేవస్థానం ఇఇ రాంబాబు, ఎఇఒ నరసింహారాజు దగ్గరుండి సిబ్బందితో మృతి చెందిన చేపలను తొలగించే ప్రక్రియను చేపట్టి, పుష్కరిణిని శుద్ధి చేసే పనులకు పూనుకున్నారు.

## పూర్తిస్థాయిలో జెవికె కిట్లు పంపిణీ

**ప్రజాశక్తి -భీమునిపట్నం :** మండలంలోని అన్ని పాఠశాలల విద్యార్థులకు ఈ నెల 12వతేదీ నాటికే పూర్తిస్థాయిలో జగనన్న విద్యాకానుక కిట్లు అందజేసినట్లు ఎంఇఒ కె అమృత బాలామణి గురు వారం తెలిపారు. 'పాఠశాలలకు చేరినా సరే విద్యార్థులకు అందని జెవికె కిట్లు' శీర్షికతో ప్రజాశక్తిలో వచ్చిన కథనానికి స్పందిస్తూ మాట్లాడారు. స్కూల్ బ్యాగ్‌లు, నోట్ బుక్‌లు, వర్క్ బుక్‌లు, మూడు జతల యూనిఫాంలు, జత బూట్లు, రెండు జతల సాక్సులు, బెల్ట్, స్కూల్ బ్యాగ్‌లు, 6-10 తరగతుల విద్యార్థులకు ఆక్స్‌ఫర్డ్ ఇంగ్లీష్, తెలుగు నిఘంటువు, 1-5 తరగతి విద్యార్థులకు పిక్టోరియల్ డిక్షనరీ పాఠశాలకు నిర్ణీత సమయంలోనే పంపిణీ చేసినట్లు వివరించారు. రోజువారీ హాజరైన విద్యార్థులకు బయోమెట్రిక్ ద్వారా కిట్లు అందజేస్తున్నట్లు వివరించారు

జివిఎంసి ఒకటో జోన్ పరిధిలోని66 ప్రాథమిక పాఠశాలల్లో 3,433 మంది విద్యార్థులకు, 11యుపి పాఠశాలల్లో ఉన్న 1181 మంది విద్యార్థులకు, 22 ఉన్నత పాఠశాలల్లో ఉన్న 5068 మంది విద్యార్థులకు మొత్తంగా 99 పాఠశాలల్లో 9,682 విద్యార్థులకు పూర్తిస్థాయిలో కిట్లను అందజేసినట్లు తెలిపారు

## న్యాయవాదులకు వైద్య బీమా గడువు
## నెలాఖరు వరకు పొడిగింపు

**ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్** : బార్ కౌన్సిల్ ఆఫ్ ఎపి ప్రవేశపెట్టిన న్యాయవాదులకు మెడికల్ గ్రూప్ ఇన్సూరెన్స్ స్కీం రెండవ స్లాట్ కింద అప్లికేషన్లు స్వీకరించనున్నట్లు బార్ కౌన్సిల్ సభ్యులు ఎస్ కృష్ణమోహన్ గురువారం తెలిపారు. ఈ స్కీం క్రింద రూ. 2 లక్షల వైద్య బీమాకు రూ.మూడు వేలు, రూ. మూడు లక్షల వైద్య బీమాకు రూ.4700 ధరావత్తును న్యాయవాదుల నుంచి స్వీకరించి మిగిలిన ప్రీమియం సొమ్మును ఆంధ్రప్రదేశ్ న్యాయమండలి, రాష్ట్ర గవర్నమెంట్ భరించి పాలసీ పట్టాలను న్యాయవాదులకు అందించనున్నట్లు తెలిపారు. ఈ వైద్యబీమాలో చేరాలనుకునే న్యాయవాదులు ఈ నెలాఖరులోగా ఆన్‌లైన్ లింక్ ద్వారా ప్రీమియం చెల్లించి పాలసీ పొందాలని సూచించారు ఈ సదావాకాశాన్ని ఉమ్మడి విశాఖపట్నం జిల్లా న్యాయవాదులు ఉపయోగించుకుని వైద్య రక్షణ పొందాలని విశాఖ జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు సూచించారు.

## మహిళా కోర్టు ఎపిపిగా గ్రంధి శ్రీనివాస్

ఎపిపి గ్రంధి శ్రీనివాస్

**ప్రజాశక్తి- లీగల్ రిపోర్టర్** : విశాఖపట్నంలోని ఆరవ అదనపు జిల్లా కోర్టు, మహిళా న్యాయస్థానం అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా సీనియర్ న్యాయవాది గ్రంధి శ్రీనివాస రావును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈయన మూడేళ్ల పాటు ఈ పదవిలో కొనసాగను న్నారు ప్రతిష్టాత్మకమైన ఈ కోర్టుకు పబ్లిక్ ప్రాసిక్యూటర్‌గా ఎంపిక చేసిన సిఎం జగన్మోహన్ రెడ్డికి శ్రీనివాసరావు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. బాధితులకు న్యాయం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈ సందర్భంగా మహిళాకోర్టు ఎపిపిగా నియమితులైన శ్రీనివాసరావుకు జిల్లా న్యాయవాదుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చింతపల్లి రాంబాబు, పైలా శ్రీనివాసరావు, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు.

## ఎంపిని పరామర్శించిన వేణుమాధవ్

పరామర్శిస్తున్న వేణుమాధవ్

**ప్రజాశక్తి- సీతమ్మధార** : విశాఖపట్నం ఎంపి ఎంవివి సత్యనారాయణ భార్య జ్యోతి, కొడుకు శరత్‌తోపాటు ఎంపి మిత్రుడు ప్రముఖ ఆడిటర్ జివిని కిడ్నాప్ చేసిన ఉదంతం ఉత్త రాంధ్రలో విష సంస్కృతికి బీజం వేసిందని, ఇటువంటి దుర్ఘటన లను ఆదిలోనే సమర్ధవంతంగా తిప్పి కొట్టిన విశాఖ పోలీసులను బిసి సంక్షేమ సంఘం జాతీయ అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్‌ఛార్జి కర్రి వేణుమాధవ్ అభినందించారు. ఎంపిని కలిసి పరామర్శించారు. భవిష్యత్‌లో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా పటిష్ట చర్యలను చేపట్టాలని కోరారు. కాగా విశాఖ ఎంపి ఎంవివిని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్.కృష్ణయ్య ఫోన్‌లో పరామర్శించి, సంఘటనపై ఆరా తీశారు.

### సమస్యలను తక్షణమే పరిష్కరించకుంటే

# 19 నుంచి నిరవధిక సమ్మె

### జివిఎంసి జోనల్ కార్యాలయాల వద్ద మున్సిపల్ కార్మికుల ధర్నా... జెడ్‌సిలకు వినతిపత్రాలు అందజేత

గాజువాక జోనల్ కార్యాలయం వద్ద ధర్నాలో మున్సిపల్ కార్మికులు

**ప్రజాశక్తి -గాజువాక :** తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ, జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యంలో కాంట్రాక్టు కార్మికులు జివిఎంసి గాజువాక జోనల్ కార్యాలయం వద్ద గురువారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ విశాఖ జిల్లా జనరల్ సెక్రెటరీ వురుకుటి రాజు, గాజువాక జోన్ జనరల్ సెక్రెటరీ గొలగాని అప్పారావు మాట్లాడుతూ, క్లాప్ ఆటో డ్రైవర్లకు కనీస వేతనం రూ. 18,500 చెల్లింపు, యుజిడి, వెటర్నరీ, పార్క్, ఇంజనీరింగ్ కార్మికులకు హెల్త్ లేదా రిస్క్ అలవెన్సు చెల్లించాలని, అనారోగ్యంతో బాధపడుతూ, ఇంటికే పరిమితమైన కార్మికులు స్థానంలో ప్రస్తుతం పనిచేస్తున్న వాళ్ల కుటుంబ సభ్యులు, వారసుల పేర్లు ఆప్కాస్ ద్వారా నమోదు చేసి జీతాలు, ఇఎస్ఐ, పిఎఫ్ వంటివి చెల్లించాలని డిమాండ్ చేశారు. ధర్నా అనంతరం జోనల్ కమిషనర్ సింహాచలానికి వినతిపత్రం అందజేశారు. ఈనెల 18లోగా సమస్యలను పరిష్కరించకుంటే,19 నుంచి నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. ధర్నాలో ఎం.రాంబాబు, కె.ఎం. శ్రీను . అప్పలరాజు, రాము, నాగరాజు, గణేష్, రమణ, రాజు, సత్యవతి, లక్ష్మణరావు, అప్పన్న, సురేష్, గాజువాక జోన్ పరిధిలోని విలీన పంచాయతీలు, పారిశుధ్యం, యుజిడి, ఇంజినీరింగ్, వాటర్ సెక్షన్, చెత్తసేకరణ విభాగం, ఎంఎస్ఎఫ్, క్లాప్ డ్రైవర్స్ వెటర్నరీ, ఇతర విభాగాల కార్మికులు పాల్గొన్నారు..

**పిఎం పాలెం:** అపరిశుభ్ర వాతావరణంలో విధులు నిర్వహించడం వల్ల అనారోగ్యానికి గురై ప్రాణాలను కోల్పోతున్న మున్సిపల్ కార్మికుల కుటుంబాల్లోని వారసులకు ఉద్యోగావకాశం కల్పించి వెంటనే విధుల్లోకి తీసుకోవాలని జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సిఐటియు విశాఖ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రెటరీ ఎంవి ప్రసాద్ డిమాండ్ చేశారు. గురువారం జివిఎంసి రెండో జోనల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికుల, క్లాప్ డ్రైవర్లు ధర్నా నిర్వహించారు. మున్సిపల్ కాంట్రాక్టు కార్మికులందరినీ రెగ్యులర్ చేయాలని, క్లాప్ డ్రైవర్లకు రూ.18,500 వేతనం చెల్లించాలని, ఇతర సమస్యలను తక్షణమే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. 18లోగా సమస్యలను పరిష్కరించి, 19 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లకుండా చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం జెడ్‌సి కనకమహాలక్ష్మికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎస్ రామప్పడు, సిహెచ్ శేషుబాబు, జి.కిరణ్, యు.రాజు, బి అప్పారావు, కె.అర్జునమ్మ, నక్క అప్పారావు పాల్గొన్నారు.

మధురవాడ జోనల్ కార్యాలయం వద్ద నినాదాలు చేస్తున్న కార్మికులు

## జగనన్న ఆణిముత్యాలుకు అభినందన

విద్యార్థుల తల్లిదండ్రులను సత్కరిస్తున్న మేయర్, డిఇఒ

**ప్రజాశక్తి - ఆరిలోవ** :పదో తరగతి, ఇంటర్ పబ్లిక్ పరీక్ష ఫలితాలలో విశాఖ తూర్పు నియోజకవర్గ స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచి,ఎంచి ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాల పేరుతో గురువారం అభినందించారు. తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అభినందన సభలో నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి ముఖ్యఅతిధిగా పాల్గొని, ప్రతిభ చూపిన విద్యార్థులకు రూ 15 వేలు, రూ 10 వేలు, రూ 5వేలు చొప్పున నగదు ప్రోత్సాహకం, ప్రశంసాపత్రాలను అందజేసి విద్యార్థులను, వారి తల్లిదండ్రులను ఘనంగా సత్కరించారు. అదే విధంగా స్కూలు తరపున మొదటి మూడు స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేసారు. ముందుగా విద్యార్థులు జాతీయగీతాలాపన చేశారు.

ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విద్యాభివృద్ధికిఎంతో ప్రాధాన్యతనిస్తోందని, సిఎం జగన్ అందిస్తున్న విద్యాపథకాలను సద్వినియోగంచేసుకుని ఉన్నతంగా రాణించాలని ఆకాంక్షించారు. డిఇఒ ఎల్.చంద్రకళ మాట్లాడుతూ క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే అదే విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తుందని, దానికి మించిన ఆస్తి వేరే ఉండదన్నారు. కార్యక్రమంలో సమగ్ర శిక్షఅభియాన్ ఎపిసి శ్రీనివాసరావు, డిఐ(అర్బన్) సువర్ణ, తోటగరువు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం జివికెడి భవాని, పాఠశాల విద్యా కమిటీ చైర్మన్ జి.ధనలక్ష్మీ, కమిటీ సభ్యులు మోహనరావు, తల్లిదండ్రులు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## ఉచిత కేన్సర్ స్క్రీనింగ్ శిబిరం

వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ సుభద్ర

**ప్రజాశక్తి -ములగాడ** : ధాన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మల్కాపురం కళంజియ సమాఖ్య ఆధ్వర్యంలో మల్కాపురం కాకరలోవ కళంజియం క్లస్టర్ కార్యాలయంలో మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రి, రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ సౌజన్యంతో మెగా కేన్సర్ స్క్రీనింగ్ వైద్యశిబిరం గురువారం నిర్వహించారు, ఈ సందర్భంగా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ వి.సుభద్ర మాట్లాడుతూ, నలభై ఏళ్లు దాటిన ప్రతి మహిళ ఎప్పటికప్పుడు గైనిక్ వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. బ్రెస్ట్‌లో గడ్డలకు స్వీయ పరీక్షలు చేసుకోవాలని, నెలసరిలో ఏవైనా మార్పులు, సమస్యలు గమనిస్తే వెంటనే డాక్టరును సంప్రదించాలని సూచించారు. క్రమం తప్పకుండా వ్యాయామం చేయడం, పోషక విలువలున్న ఆహారం భుజించడం, వ్యక్తిగత పరిశు భ్రత ఎంతో అవసరమన్నారు. ఈ సందర్భంగా దాదాపు వంద కళంజియ సభ్యులకు కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించగా, వారిలో నలుగురుకి సమస్య ఉన్నట్లు గుర్తించి, మహాత్మాగాంధీ కేన్సర్ ఆసుపత్రికి రిఫర్ చేశారు. డాక్టర్ సుభద్ర , డాక్టర్ శ్వేత, ఏరియా బిజినెస్ మేనేజర్ శివరామకృష్ణ, వైజాగ్ రీజినల్ హెల్త్ కోఆర్డినేటర్స్ మురళీకృష్ణ, అక్రమ్ సమాఖ్య కోఆర్డినేటర్ సుభాషిణి, హెల్త్ అసోసియేట్ విజయ, సమాఖ్య సిబ్బంది చంద్రకళ, తులసి, వరలక్ష్మి, కృష్ణవేణి, ధనలక్ష్మి సమాఖ్య నాయకులు పార్వతి, క్లస్టర్ ఇసి లీడర్లు, సభ్యులు పాల్గొన్నారు

## ఎపిఇఎపి సెట్‌లో 'శశి' విద్యార్థుల ప్రతిభ

**ప్రజాశక్తి -తగరపువలస** : స్థానిక సంగివలస శశి కళాశాల విద్యార్థులు ఎపి ఇఎపి సెట్ ఫలితాల్లో ప్రతిభ కనబరిచి మంచి ర్యాంకులు సాధించినట్లు శశి విద్యాసంస్థల చైర్మన్ బూరుగుపల్లి వేణుగోపాలకృష్ణ, వైస్ చైర్మన్ మేకా నరేంద్రకృష్ణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తమ కాలేజీకి చెందిన విద్యార్థుల్లో ఇంజనీరింగ్ విభాగంలో రౌతు సాయి నారాయణకు 261వ ర్యాంక్, కుందెరపు అభిరామ్‌కు 278వ ర్యాంక్, రాయపాటి నాగ వంశీకృష్ణకు 315వ ర్యాంక్, బలివాడ కావ్యకు 353వ ర్యాంక్, దమ్ము వీర వెంకట చైతన్య పవన్ కుమార్‌కు 411వ ర్యాంక్, పారేపల్లి సాయిరామ్‌కు 419వ ర్యాంక్ వచ్చిందన్నారు. వడ్డాది శ్రీసూర్య గణవంత్ 446 వర్యాంక్, దాసరి ప్రణతి 493వ ర్యాంక్ సాధించినట్లు తెలిపారు. 1000 లోపు 9 మంది, 2000 లోపు 37 మంది, ఐదు వేల లోపు 75 మంది, 10వేల లోపు 127 మంది ర్యాంకులు సాధించారన్నారు.

అగ్రి మెడికల్ విభాగంలో చింతోజు హర్ష సత్య వర్ధన్ 61వ ర్యాంక్, కల్యంపూడి హర్షిత 71వ ర్యాంక్, బొడ్డేపల్లి రవీంద్ర 89 వ ర్యాంక్, పైలా కృష్ణచైతన్య 110వ ర్యాంక్, జామి తోయజాక్ష 112వ ర్యాంక్,బొడ్డు శ్రీదేవి 616వ ర్యాంక్, గంటా భువనేశ్వరి 664వ ర్యాంక్, పట్టా జయశ్రీ 768వ ర్యాంక్ సాధించారని తెలిపారు. 1000 లోపు 8 మంది, 2000 లోపు 17 మంది, 5000 లోపు 27 మంది ర్యాంకులు సాధించినట్లు తెలిపారు ప్రతిభ కనబరిచిన విద్యార్థులను శశి విద్యాసంస్థల కరస్పాండెంట్ మేకా క్రాంతిసుధ అభినందించారు.

## పేద విద్యార్థినికి వాకర్స్ సాయం

పేద విద్యార్థినికి విద్యాసామగ్రి అందజేస్తున్న వాకర్స్ సభ్యులు

**ప్రజాశక్తి -భీమునిపట్నం** : పదో తరగతి చదువుతున్న పేద విద్యార్థినికి స్థానిక జమ్మిచెరువు వాకర్స్ సభ్యులు గురువారం రూ.20 వేలు విలువైన విద్యా సామగ్రి అందజేశారు. స్కూల్ యూనిఫామ్, రెండు జతల బూట్లు, పాఠ్య పుస్తకాలు, నోట్ బుక్స్ అందజేశారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు, న్యాయవాది ఎన్ జనార్ధనరావు, విశ్రాంత ఉద్యోగులు లక్ష్మీనారాయణ, శంకర్‌కుమార్, దత్తి ఈశ్వరరావు, వెంకటేశ్వరరావు, న్యాయవాది సునీల్ , ఎస్ జోగారావు పాల్గొన్నారు

## స్వమిత్ పథకానికి
## 74 మంది లబ్ధిదారుల గుర్తింపు

**ప్రజాశక్తి-పద్మనాభం** : మండలంలోని బుడ్డివలస పంచాయతీలో గురువారం స్థానిక తహశీల్దార్ తోట శ్రీవల్లి ఆధ్వర్యంలో స్వమిత్ గ్రామసభను నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ పరిధిలో 127 ఇళ్లు ఉన్నట్లు గుర్తించగా, వారిలో 74 మందిని స్వమిత్ పథకానికి అర్హులుగా గుర్తించామన్నారు. గుర్తించిన వారిపై ఎటువంటి ఫిర్యాదు రాకుంటే, వాటిని పరిశీలించి పట్టాలు ఇస్తామన్నారు. కార్యక్రమంలో బుడ్డివలస సర్పంచ్ పి సూర్యనారాయణ, కోరాడ సర్పంచ్ కె లక్ష్మణరావు, డిప్యూటీ తహశీల్దార్ శ్రీనివాసరావు. పాల్గొన్నారు.

# శ్రీశ్రీకి ఘన నివాళి

బీచ్ రోడ్డులో నివాళ్లర్పిస్తున్న ప్రజా సంఘాల నాయకులు

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ

మహాకవి శ్రీశ్రీ 40వ వర్ధంతిని పురస్కరించుకుని గురువారం ఉదయం ప్రజానాట్యమండలి విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆర్‌కె బీచ్‌లో ఉన్న శ్రీశ్రీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా సాహితీ స్రవంతి సీనియర్ నాయకులు చలపతి, ప్రజానాట్య మండలి కార్యదర్శి ఎం.చంటి, జిల్లా అధ్యక్షులు జి.రమణ, జిల్లా గౌరవ అధ్యక్షులు దండు నాగేశ్వరరావు, బాదంగీర్ సాయి, సాహితీ స్రవంతి నాయకులు ఎవిఆర్‌కె.మూర్తి వై.అప్పారావు, డివైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి సంతోష్ కుమార్, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు అజయ్, సిఐటియు నాయకులు సీతారత్నం తదితరులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ శ్రీశ్రీ అందించినటువంటి అభ్యుదయ, విప్లవకర సాహిత్యాన్ని ప్రజానాట్య మండలి నిరంతరం కళారూపాల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్తోందన్నారు. నేటి పరిస్థితుల్లో కార్మిక హక్కులు, ప్రభుత్వ రంగ సంస్థల పరిరక్షణ కర్తవ్యాలను మరింత బలంగా ప్రజల్లోకి తీసుకెళ్లే ప్రయత్నం చేస్తున్నట్లు తెలిపారు.

**మాడుగుల :** గేయ రచయిత, కవి శ్రీరంగం శ్రీనివాసరావు 40వ వర్ధంతి వేడుకలు గురువారం వీర వల్లి అగ్రహారం ఎంపిపి యుపి పాఠశాలలో లో నిర్వహించారు. అతిథి దేవోభవ స్వచ్ఛంద సంస్థ కార్యదర్శి ఆరిపాక కామేశ్వరరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పాటల పోటీలు నిర్వహించారు. విజేతలకు స్కూల్ కమిటీ చైర్మన్ దొండ హరిబాబు చేతుల మీదుగా బహుమతుల ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం బొర రమణ తదితరులు పాల్గొన్నారు.

**సిపిఎం ఆధ్వర్యాన**

**అనకాపల్లి :** స్థానిక దొడ్డి రామునాయుడు భవన్‌లో గురువారం సిపిఎం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మహాకవి శ్రీశ్రీ 40 వర్ధంతి సభ నిర్వహించారు. ముందుగా సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం, సీనియర్ నాయకులు ఎ.బాలకృష్ణ, యువజన నాయకులు వై.శివాజీ శ్రీశ్రీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా లోకనాథం మాట్లాడుతూ శ్రీశ్రీ అందించిన అభ్యుదయ విప్లవ రచనలు ప్రజలను ఎంతో ప్రేరేపించాయన్నారు. సోషలిస్టు భావాల ప్రభావంతో ఆయన అందించిన పాటలు, సాహిత్యం సమాజాన్ని ఆలోచింపజేశాయని తెలిపారు. సోషలిస్టు విప్లవమే ఈ దేశానికి మార్గమని నమ్మి రచనలు చేశారన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా అధ్యక్షులు రుత్తల శంకరరావు, వి వి శ్రీనివాసరావు, తరుణ్, సంతోష్, రమేష్, ఈశ్వరరావు, నూక అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లిలో శ్రీశ్రీ చిత్ర పటానికి పూలమాల వేస్తున్న బాలకృష్ణ తదితరులు

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి తదితరులు

## 'కలశం, నానీలు-చక్రపాణీలు' పుస్తకాల ఆవిష్కరణ

ప్రజాశక్తి-అనకాపల్లి

డాక్టర్ చక్రపాణి రచించిన కలశం, నానీలు-చక్రపాణీలు పుస్తకాలను స్థానిక వివేకానంద ట్రస్టు హాలులో బుధవారం రాత్రి ఇండియన్ హైకూ క్లబ్, అనకాపల్లి సాహితీ మిత్రుల ఆధ్వర్యంలో వివేకానంద ట్రస్ట్ వ్యవస్థాపకులు డాక్టర్ కె.విష్ణుమూర్తి, అనకాపల్లి ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతి ఆవిష్కరించారు. అనంతరం గొంతిన రంగబాబు అధ్యక్షతన జరిగిన సభలో కలశం కవితా సంపుటిని ప్రముఖ రచయిత గుండాన జోగారావు, నానీల సంపుటిని ఇండియన్ హైకూక్లబ్ వ్యవస్థాపకులు డాక్టర్ తలతోటి పృథ్వీరాజ్ సమీక్షించారు. డాక్టర్ విష్ణుమూర్తి తమ సందేశంలో కవిత్వం అర్థంచేసుకోవటానికి విశాలదృక్పథం ఉండాలని, కవులకు తగిన ప్రోత్సాహం లభించాలని సాహిత్యం, తెలుగు భాష పట్ల చక్రపాణికి గల అభిరుచిని అభినందించారు. కార్యక్రమంలో ఎపి రచయితల సంఘం ఉపాధ్యక్షులు మాధవీ సనారా, కరి మల్లీశ్వరి, ద్విభాష్యం నాగలక్ష్మి, కొరాడ అప్పలరాజు, డాక్టర్ పివిఎల్.సుబ్బారావు, ఆర్‌విఎల్.గాయత్రి, ఎస్‌వి.రమణ, సివి.రాజేశ్వరరావు, చక్రపాణి కుటుంబ సభ్యులు, సాహితీప్రియులు పాల్గొన్నారు.

## మేడిపల్లి గణేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి- అనకాపల్లి

తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ కార్యాలయంలో టిడిపి అనకాపల్లి జిల్లా వాణిజ్య విభాగ అధ్యక్షులు మేడపల్లి గణేశ్వరరావు జన్మదిన వేడుకలు గురువారం బుద్ద నాగ జగదీశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ముందుగా గణేష్‌కు శాలువాతో సత్కరించి నూకాంబికా అమ్మవారి చిత్రపటాన్ని బహుకరించారు. అనంతరం కేక్ కటింగ్ చేసి గణేష్‌కు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బొలిశెట్టి శ్రీనివాసరావు, మల్ల గణేష్, సురే సతీష్, కుప్పిలి జగన్, కోట్ని రామకృష్ణ, బోడి వెంకటరావు, మారిశెట్టి శంకరరావు, కాండ్రేగుల సత్యనారాయణ, యలమంచిలి బంగారు రాజు, గుర్రాల వాసు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

## 'కార్పొరేట్‌కు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు'

ప్రజాశక్తి-అచ్యుతాపురం

రాష్ట్రంలో కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు పనిచేస్తున్నట్లు ఎలమంచిలి ఎమ్మెల్యే కన్నబాబు రాజు చెప్పారు. అచ్యుతాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో గురువారం ఎలమంచిలి నియోజకవర్గ స్థాయి జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమం చేపట్టారు. ఎలమంచిలి నియోజకవర్గంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఆయన చేతుల మీదుగా సత్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గతంలో ప్రభుత్వ పాఠశాలలో అంటే చులకనగా చూసే వారని, జగన్ ప్రభుత్వం వచ్చిన తరువాత కార్పొరేట్ స్థాయికి తీర్చిదిద్దారని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ప్రతిరోజు కోడిగుడ్డు, చెక్కిళ్ల మంచి నాణ్యతా ప్రమాణాలతో కూడిన పౌష్టిక ఆహారం పెడుతున్నారని తెలిపారు. అనంతరం జగనన్న విద్యా కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో డిసిసిబి మాజీ చైర్మన్ యు సుకుమార వర్మ, ఎంపిపి కోన సంధ్య లక్ష్మణ్ నాయుడు, వైసిపి మండల అధ్యక్షుడు దేశం శెట్టి శంకర్రావు, జెడ్‌పి కోఆప్షన్ సభ్యుడు నర్మాల కుమార్, బోదుపు గోవిందు, సర్పంచులు ఎంపిటిసి సభ్యులు పాల్గొన్నారు.

నగదు బహుమతి, ప్రశంసా పత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కన్నబాబురాజు

మానవహారం నిర్వహించిన డ్వాక్రా మహిళలు

## రహదారి భద్రతపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- కశింకోట

రహదారుల భద్రతపై మండలంలోని తేగాడ గ్రామంలో డ్వాక్రా మహిళలతో గురువారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, ఎంపిటిసి తుంపాల తాయారు మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, నాలుగు చక్రాల వాహనదారులు తప్పనిసరిగా సీటు బెల్టు ధరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్ నీటిపల్లి లక్ష్మీ, ఎపిఎమ్ శ్రీనివాసరావు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, వైయస్సార్ పార్టీ నాయకులు నీటిపల్లి దివాకర్, సిసి అనురాధ, మహిళ పోలీస్ తేజస్విని, సంతోషి, విఒఎలు మంగలక్ష్మి, చిన్నపాప పాల్గొన్నారు.

## 24న డ్యాన్సింగ్ సూపర్ స్టార్ మెగా ఈవెంట్

**ప్రజాశక్తి - కలెక్టరేట్ :** ప్రతి ఏటా మాదిరిగానే ఈసారీ విశాఖ నగరంలో డ్యాన్సింగ్ సూపర్ స్టార్ సీజన్ - 6 గ్రాండ్ ఫైనల్స్ నిర్వహిస్తున్నట్లు పేస్ క్రియేటర్స్ డ్యాన్స్ అకాడమీ ఫౌండర్ రంజన్ నాయక్ తెలిపారు. గురువారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన ఈవెంట్‌కు సంబంధించిన వివరాలు తెలిపారు. గంధం ఫుడ్స్ నాపల్లి సంస్థ ప్రధాన స్పాన్సర్‌గా ఈ నెల 24న సిరిపురం గురజాడ కళాక్షేత్రంలో ఈ మెగా ఈవెంట్ చేపడుతున్నట్లు వెల్లడించారు. దేశ వ్యాప్తంగా 20 ప్రధాన నగరాల్లో ఆడిషన్స్ నిర్వహించామని, 28 టీములను గ్రాండ్ ఫైనల్‌కు ఎంపిక చేశామని తెలిపారు. ఈ ఈవెంట్‌కు ప్రధాన న్యాయ నిర్ణేతగా ప్రముఖ బాలీవుడ్ కొరియోగ్రాఫర్ ధర్మేష్ వ్యవహరిస్తున్నారని, ముఖ్య అతిథిగా రాష్ట్ర మత్స్యశాఖ మంత్రి సీదిరి అప్పలరాజు, గౌరవ అతిథిగా ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్ హాజరవుతారని తెలిపారు. ఇండియన్ హిప్ హాప్ ఇంటర్నేషనల్ విన్నర్స్ సాగర్ బోరా, కార్తీక్ రాజా, రవివర్మ, దీపక్ రాజ్‌పుత్ తదితరులు న్యాయ నిర్ణేతలుగా వ్యవహరిస్తారని అన్నారు. ఈవెంట్ ప్రధాన స్పాన్సర్ సునీత మాట్లాడుతూ పిల్లల్లో నైపుణ్యాన్ని, ప్రతిభను వెలికి తీసే ఈ తరహా ఈవెంట్లకు స్పాన్సర్‌గా ఉండటం చాలా ఆనందంగా ఉందన్నారు. మొదటి విజేతకు రూ.లక్ష, రెండో విజేతకు రూ.50 వేలు, మూడో విజేతకు రూ.25 వేలు బహుమతిగా ఇస్తామన్నారు. సమావేశంలో ఈవెంట్ హౌస్ మేనేజింగ్ డైరెక్టర్ రవిశంకర్, డాక్టర్ అగర్వాల్ హాస్పిటల్ మెడికల్ డైరెక్టర్ డాక్టర్ జేమ్స్ ఆడమ్స్, రౌండ్ టేబుల్ ఇండియా ప్రతినిధి ప్రతీక్ సింగ్, ఆర్కే డిజిటల్స్ రూపేష్, ఫైన్‌ట్రైన్ రెస్టారెంట్ ఎమ్‌డి చాందిని పాల్గొన్నారు.

### కంపల్సరీ బదిలీ పేరుతో

## మైదాన ప్రాంత టీచర్లను ఇబ్బంది పెట్టడం తగదు

### యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నబ్బాయి

ప్రజాశక్తి- అనకాపల్లి

2023 ట్రాన్స్‌ఫర్స్‌లో కంపల్సరి బదిలీ పేరుతో మైదాన ప్రాంతం నుంచి వందల సంఖ్యలో మహిళా ఉపాధ్యాయులను, ఉపాధ్యాయులను వందల కిలోమీటర్ల దూరంగా ఉన్న ఏజెన్సీ ప్రాంతానికి బదిలీ చేయడం సరికాదని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విమర్శించారు. విద్యాశాఖ మంత్రి 30 శాతం అదనపు ఖాళీలను వేకెన్సీగా చూపిస్తామని చెప్పినప్పటికీ, మైదాన ప్రాంతంలో ఉన్న చాలా ఖాళీలను అధికారులు బ్లాక్ చేసి వారిని ఏజెన్సీ ప్రాంతానికి పంపించారని తెలిపారు. ఇప్పుడు బదిలీ అయిన ఉపాధ్యాయుల ఉద్యోగ నియామక ఒప్పందంలో ఏజెన్సీ ప్రాంతాల్లో పనిచేయాలనే నిబంధన లేదని గుర్తు చేశారు. జీవో నెంబర్ 31 సుప్రీం కోర్టు కొట్టి వేసిన తరువాత నియామకమైన ఉపాధ్యాయులను మాత్రమే ఏజెన్సీలో నియమించాలన్నారు. మైదానంలో పోస్టులను బ్లాక్ చేసి, భర్త/భార్య పనిచేసే ప్రాంతానికి కొన్ని వందల కిలోమీటర్ల దూరంలో ఉన్న ఏజెన్సీ పాఠశాలల్లో పని చేయమని చెప్పడం మానవత్వం కాదని, దీనిపై పునరాలోచన చేయాలని కోరారు.

## వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు పాటించాలి

మాట్లాడుతున్న వాతావరణ కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సునంద

ప్రజాశక్తి-అనకాపల్లి

వ్యవసాయ శాస్త్రవేత్తలు అందించే వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను రైతాంగం పాటించాలని విశాఖపట్నం వాతావరణ హెచ్చరికల కేంద్రం డైరెక్టర్ డాక్టర్ సునంద తెలిపారు. స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఆర్ఏఆర్ఎస్ పరిశోధన సహ సంచాలకులు డాక్టర్ పివికే జగన్నాధరావు అధ్యక్షతన వాతావరణం- పంటలపై ప్రభావం, వాతావరణం ఆధారిత వ్యవసాయ సలహాల ప్రాముఖ్యత అనే అంశంపై రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వాతావరణ మార్పులను అనుసరించి రైతాంగం తగిన యాజమాన్య పద్ధతులు పాటించాలన్నారు. మేఘదూత్ మొబైల్ అప్లికేషన్ వినియోగించుకొని వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలు పాటిస్తే లాభసాటిగా ఉంటుందన్నారు. గ్రామీణ కృషి మౌసమ్ సేవా కార్యక్రమం నోడల్ ఆఫీసర్ డాక్టర్ కె.వి రమణమూర్తి పథక ప్రాముఖ్యతను వివరించారు. ఆర్ఏఆర్ఎస్ శాస్త్రవేత్తలు డాక్టర్ ఎంబిజిఎస్ కుమార్, డాక్టర్ ఎం విశాలాక్షి, డాక్టర్ వి చంద్రశేఖర్, డాక్టర్ ఎ అలివేణి, వివిధ పంటల్లో పురుగుల ఉధృతికి అనువైన వాతావరణ పరిస్థితులు, నివారణ యాజమాన్య పద్ధతులు వివరించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్తలు డాక్టర్ ముకుందరావు, ఆదిలక్ష్మి, సరిత, శ్రీదేవి, రామలక్ష్మి, రామారావు, శిరీష, ఉమామహేశ్వరరావు, పద్మ, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

## రైతు కూలీ సంఘం మహాసభ పోస్టర్ ఆవిష్కరణ

**ప్రజాశక్తి-చోడవరం :** రైతుకూలీ సంఘం (ఆం.ప్ర) అనకాపల్లి జిల్లా మహాసభను విజయవంతం చేయాలని సంఘం నాయకులు గురువారం చోడవరం అంబేద్కర్ భవన వద్ద పోస్టర్‌ను ఆవిష్కరించారు. రైతు కూలీ సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ జిల్లాలో రైతులు కార్మికులు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై మహాసభల్లో చర్చించి పరిష్కార మార్గం కనుక్కోవడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు పైలా రమేష్, కల్పన, రెడ్డి లక్ష్మీ, అయితిరెడ్డి అప్పలనాయుడు, అనపర్తి శ్రీను పాల్గొన్నారు.

రుణాలు అందజేస్తున్న పిఎసిఎస్ అధ్యక్షులు కొండబాబు

## సకాలంలో రుణాలు చెల్లించాలి

ప్రజాశక్తి - యలమంచిలి

తీసుకున్న పంట రుణాలను సకాలంలో చెల్లించి రైతులు అభివృద్ధి చెందాలని, బ్యాంకును కూడా ప్రగతి పథాన నడిపించాలని యలమంచిలిలోని కొక్కిరాపల్లి ప్రాథమిక వ్యవసాయ సంఘం ఛైర్మన్ మళ్ల కొండబాబు కోరారు. ఆయన గురువారం ఉదయం బ్యాంకు ఆవరణలో జరిగి రుణ పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. రైతులకు రూ.17 లక్షల పంట రుణాలను అందించారు. సభ్యులైన రైతులు ఎకరానికి గరిష్ఠంగా రూ.5లక్షల రుణం పొందే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో సంఘం డైరెక్టర్లు పందిరి రాంబాబు, ఎర్రంశెట్టి చిన్నబ్బాయి, సిఇఓ తదితరులు హాజరయ్యారు.

## 'జిల్లాలో పెద్ద ఎత్తున దొంగ ఓట్లు నమోదు'

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లాలో వైసిపి పెద్ద ఎత్తున దొంగ ఓట్ల నమోదు కార్యక్రమం చేస్తున్నట్లు తెలుస్తుందని, మరో వైపు ప్రతిపక్ష పార్టీకి చెందిన వారి ఓట్లు తొలగిస్తున్నారని టిడిపి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగజగదీశ్వరరావు ఆరోపించారు. గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళన పేరుతో వాలంటీర్ల ద్వారా ఇష్టానుసారం అనకాపల్లి జిల్లా మొత్తంగా 70,600 చేర్చినట్లు తమ పార్టీ గుర్తించిందని పేర్కొన్నారు. దీనిలో చనిపోయిన వారు, శాశ్వతంగా వలస పోయినవారు ఉన్నారన్నారు. మరో వైపు మాడుగుల నియోజవర్గంలో సుమారు 9500 ఓట్లను, చోడవరం నియోజవర్గంలో 5100 ఓట్లను, పెందుర్తి 5800, యలమంచిలి 8400 ఓట్లను, పాయకరావుపేట 4800 ఓట్లను, అనకాపల్లి 10,500 ఓట్లను వాలంటీర్లు ఏ కారణం చూపకుండా తొలగించారని తెలిపారు. తక్షణమే తొలగించిన ఓట్లను పునరుద్ధరణ చేయకపోతే కలెక్టర్ ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో టిడిపి నాయకులు నడిపల్లి గణేశ్వరరావు, సురే సతీష్, కుప్పిలి జగన్, కోట్ని రామకృష్ణ, బుద్ద భువనేశ్వర రావు, మల్ల గణేష్, గుర్రాల వాసు, కాంగ్రేసుల సత్యనారాయణ, మారిశెట్టి శంకర్రావు తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని సబ్బవరం-1, 2 సెక్షన్ల పరిధిలోని 33/11కెవి ఫీడర్ పిఎంఐ పనుల కారణంగా ఈ నెల16న (శుక్రవారం ) ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు సబ్బవరం, అంతకాపల్లి సబ్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని సబ్బవరం సబ్ డివిజన్ డిప్యూటీ ప్రాజెక్ట్ ఇంజినీర్ బి. నిరీక్షన్ అంబేద్కర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. కావున ఆయా గ్రామాల విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

## ఉపాధి హామీ సామాజిక ఆడిట్

ప్రజాశక్తి-పరవాడ

పరవాడ మండలంలో గ్రామీణ ఉపాధిహామీ పథకం 2022-2023 ఆర్థిక సంవత్సరంకు జరిగిన సామాజిక తనిఖీ ప్రజా వేదిక గురువారం పరవాడ మరిడిమాంబ కళ్యాణ మండపంలో నిర్వహించారు. ఈ ఆడిట్‌లో 4.98 కోట్లకు జరిగింది. ఫైండింగ్స్ 1.09 లక్షలు, ఫైన్ 3500 రూపాయలు వసూలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పైల వెంకట పద్మా లక్ష్మి శ్రీనివాసు, వైస్ ఎంపిపి బి. అప్పల రాజు, అనకాపల్లి జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఈ.సందీప్, అదనపు ప్రోజెక్ట్ డైరెక్టర్ రోజా రమణి, జిల్లా నిఘా విభాగం అధికారి నిర్మల దేవి, మండల అభివృద్ధి అధికారి శ్రీ హేమ సుందర్ రావు, సోషల్ ఆడిట్ ఎస్ఆర్ పి సూర్యనారాయణ, అన్ని శాఖల సిబ్బంది పాల్గొన్నారు .

సామాజిక ఆడిట్‌లో పాల్గొన్న అధికారులు

# దిశ యాప్‌పై మెగా డ్రైవ్

డౌన్‌లోడ్ చేసుకున్న దిశ యాప్‌ను చూపుతున్న మహిళా ఉద్యోగులు

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లా వ్యాప్తంగా దిశ యాప్‌ను ప్రజల రక్షణ కొరకు ఇన్‌స్టాల్ చేసుకునే విధంగా రెండు రోజులు పాటు మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు ఎస్పీ కెవి.మురళీకృష్ణ వెల్లడించారు. ఈ మేరకు గురువారం దిశ యాప్‌పై సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించారు. జూన్ 14, 15 తేదీలలో రాష్ట్ర వ్యాప్తంగా దిశ యాప్ మెగా డ్రైవ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. పోలీస్ అధికారులు, సిబ్బంది మరియు వార్డు/గ్రామ మహిళ సంరక్షణ కార్యదర్శులు వారి పరిధిలోని గ్రామాలు, బస్టాండ్, రైల్వే స్టేషన్, ముఖ్యమైన కూడళ్ళ, కాలేజీలు, స్కూల్‌లు, వ్యాపార సంస్థలు, ఫ్యాక్టరీలలో దిశ యాప్ డౌన్లోడ్ వర్క్ షాప్ నిర్వహించి ప్రజలకు దిశ యాప్ పై విస్తృత అవగాహన కల్పించి వారిచే దిశ యాప్ డౌన్లోడ్ చేయించి రిజిస్ట్రేషన్ చేయించినట్లు చెప్పారు. అత్యవసర పరిస్థితుల్లో ఒకవేళ ఫోన్ కాల్ కు స్పందించని పరిస్థితుల్లో దిశ యాప్ లో 100, 112 వంటి అత్యవసర నెంబర్లతో పాటు పోలీస్ స్టేషన్లు, ఆసుపత్రులు, మెటర్నిటీ సెంటర్లు, బ్లడ్ బ్యాంకులు, ట్రామా కేర్ సెంటర్లు, మెడికల్ షాపుల వివరాలు పొందుపరచి వున్నాయని తెలిపారు. దిశ యాప్ కేవలం మహిళలకే కాకుండా ప్రతి ఒక్కరికీ ఉపయోగపడుతుందని చెప్పారు.

**చోడవరం** : దిశ యాప్ ద్వారా రక్షణ పొందవచ్చునని చోడవరం సిఐ బి శ్రీనివాసరావు అన్నారు. గురువారం డిగ్రీ కళాశాలలో విద్యార్థినిలకు సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల రక్షణ కోసం దిశా యాప్ రూపొందించిందని ప్రమాదకర పరిస్థితులు ఏర్పడినప్పుడు, ఆకతాయిల నుండి ఇబ్బందులు, వేధింపులు వంటివి ఎదురైనప్పుడు మహిళలకు రక్షణగా ఉంటుందని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సై సూర్యనారాయణ, ప్రిన్సిపల్ కె రామచంద్రరావు, లెక్చరర్స్ కిరణ్ కుమార్, బి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

**గొలుగొండ** : మహిళలు దిశ యాప్‌ను డౌను లోడ్ చేసుకొని సద్వినియోగం చేసుకోవాలని కేడీపేట ఎస్సై ఉపేంద్ర సూచించారు. ఈ సందర్భంగా కేడీపేటలో దిశ యాప్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ, మహిళల రక్షణకు దిశా యాప్ రూపొందించారన్నారు.

# 30 వరకు జీవాలకు నట్టల నివారణ మందు పంపిణీ

ప్రజాశక్తి- కె.కోటపాడు

ఈనెల 30వ తేదీ వరకు మండలంలో ఉన్న మేకలు గొర్రెలకు నట్టల నివారణ కార్యక్రమం నిర్వహించడానికి చర్యలు తీసుకుంటున్నామని పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ జి బైరాగి తెలిపారు. ప్రతి ఏడాదిలాగే ఈ ఏడాది జూన్ మాసంలో 15 రోజులు పాటు కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. మండలంలో 18 వేల జీవాలు ఉన్నాయని ప్రతి గ్రామంలోనూ పశువైద్య సహాయకులు ఈ కార్యక్రమాన్ని చేపడతారని తెలిపారు. నట్టల నివారణ మందు తాగించడం వల్ల గొర్రెలు మేకలు, బరువు పెరిగి మాంసం దిగుబడి వస్తుందని చెప్పారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, ఈ అవకాశం వినియోగించుకోవలసిందిగా ఆయన కోరారు.

**సబ్బవరం** : మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు వాక్సినేషన్ వేస్తున్నట్లు ఆరిపాక పశు వైద్యాధికారి డాక్టర్ ఎస్.స్వర్ణలత తెలిపారు. పల్లవానిపాలెంలో గురువారం గొర్రెలు, మేకలకు నట్టల నివారణకు మందులు వేశారు. ఈనెల15 నుండి 30 వరకు మండలంలోని గొర్రెలు, మేకలకు నట్టల నివారణ కు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో గొట్టివాడ జెవిఓ, కెవి.రమణారావు, పశుసంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

నట్టల నివారణకు వ్యాక్సిన్ వేస్తున్న దృశ్యం

## గ్రంథాలయంలో రికార్డుల పరిశీలన

ప్రజాశక్తి అచ్యుతాపురం

అచ్యుతాపురం గ్రంథాలయంలో రికార్డులను గురువారం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి ఎన్ వెంకట్రావు పరిశీలించారు. ఈ సందర్భంగా గ్రంథాలయంలో చదవడానికి వచ్చిన పాఠకులతో ఆయన మాట్లాడారు. ప్రతిరోజు ఎక్కువమంది గ్రంథాలయానికి వచ్చి చదువుతున్నారా అని ప్రశ్నించారు. గ్రంథాలయంలో వేసవి శిక్షణ శిబిరాలను గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు విజయవంతంగా నిర్వహించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అధికారి దొడ్డి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్డు మరమ్మతులు చేపట్టాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

అనకాపల్లి - అచ్యుతాపురం రోడ్‌ను తక్షణమే మరమ్మతులు చేసి ప్రయాణికుల ప్రాణాలను కాపాడాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆర్డీవో చిన్నికృష్ణకు వినతిపత్రం అందజేశారు. నిత్యం వేలాది మంది ప్రయాణం చేస్తున్న రోడ్ ను మరమ్మతులు చేయకుండా అధికార యంత్రాంగం తీవ్రమైన నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. ఈ రోడ్లో ప్రయాణం చేస్తున్న అనేకమంది దుమ్ము, ధూళి కారణం గా అనారోగ్యంతో బాధపడుతున్నా పట్టించుకొనే పరిస్థితులు లేవన్నారు. వెన్నముక నొప్పి కోసం ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదని ఆవేదన వ్యక్తంచేశారు. తక్షణమే రోడ్ మరమ్మతులు చేపట్టాలని లేని పక్షంలో ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వియ్యపు రాజు, నరాలశెట్టి సత్యనారాయణ, సాయి లక్ష్మణ, కొల్లి సత్తారావు, గణపతి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## జన్ భాగీదారీపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి- సబ్బవరం

మండలంలోని మల్లునాయుడు పాలెం గ్రామంలో జన్ భాగీదారీ కార్యక్రమంపై గురువారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శి మాట్లాడుతూ మూడేళ్ళు నిండిన పిల్లలను అంగన్వాడీ ప్రి స్కూళ్లలో చేర్పించాలని కోరారు. ప్రి స్కూళ్లలో విద్యను ఆటలు, పాటలు ద్వారా అందించడానికే జన్ భాగీదారీ కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మహిళా పోలీస్ ధనలక్ష్మి, వెల్ఫేర్ అసిస్టెంట్ శివ, అంగన్వాడీ కార్యకర్తలు వి. సుభాషిణి, ఎస్. అక్కమ్మ, ఆర్. రమణమ్మ, ఆయాలు జి. రేవతి, జి. నాగమణి, జి. దేముడమ్మ తదితరులు పాల్గొన్నారు.

## వైసిపి పాలనలో పేదలు బతకలేని పరిస్థితి

ప్రజాశక్తి-అనకాపల్లి

వైసిపి పాలనలో పేదలు బతకలేని పరిస్థితి ఏర్పడిందని మాజీ శాసనసభ్యులు పీలా గోవింద సత్యనారాయణ విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. టీడీపీ అధికారంలోకి రాగానే విద్యుత్ ఛార్జీలను నియంత్రిస్తామన్నారు. ఇప్పటికి 8సార్లు విద్యుత్ ఛార్జీలను పెంచారన్నారు. పేదల ప్రభుత్వం అంటే విద్యుత్, నిత్యవసర వస్తువుల ధరలు, పెట్రోల్ డీజిల్ ధరలు పెంచడమేనా అని ప్రశ్నించారు. ప్రజల పేరుతో జగన్ మోహన్ రెడ్డి ప్రజా ధనాన్ని లూటీ చేస్తున్నారని ధ్వజమెత్తారు. రానున్న రోజులలో ప్రజలే తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు.

## విశాఖలో క్షీణించిన శాంతి భద్రతలు

ప్రజాశక్తి - కలెక్టరేట్

ప్రశాంతంగా ఉండే విశాఖ నగరంలో వైసిపి పాలన వచ్చాక శాంతి భద్రతలు పూర్తిగా క్షీణించాయని టిడిపి విశాఖ పార్లమెంట్ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు ఆరోపించారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ అధికార పార్టీకి చెందిన పార్లమెంటు సభ్యుని భార్యను, కుమారుడిని కిడ్నాప్ చేసే స్థాయికి శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. ఈ కిడ్నాప్ వ్యవహారానికి కారణం ఆర్థిక లావాదేవీలేనని అన్నారు. సమావేశంలో టిడిపి గవర విభాగం రాష్ట్ర నాయకులు మళ్ల సురేంద్ర, విల్లూరి డాక్టర్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

ఆర్ అండ్ బి అధికారికి సమస్యను విన్నవిస్తున్న ఎమ్మెల్యే ధర్మశ్రీ

## లింకు రోడ్ల సమస్యపై ఎమ్మెల్యే వినతి

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం నియోజకవర్గంలో ఉన్న లింక్ రోడ్ల నిర్మాణాలకు అనుమతులు మంజూరు చేయాలని స్థానిక ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గురువారం విజయవాడలో ఆర్ అండ్ బి, ఏపీఆర్డిసి ఎండి శ్రీనివాసరెడ్డిని, ఈఎంసి అధికారి నయా ముల్లను కలిసి వినతిపత్రం అందజేశారు. నియోజకవర్గంలో తోటకూర పాలెం, లక్ష్మీపురం, పిఎస్ పేట, గవరవరం, బి.యన్ రోడ్ నుండి గ్రామాలకు పోవు రోడ్లకు నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి ప్రారంభించాలని కోరారు.

## వరి విత్తనాలకు దరఖాస్తు చేసుకోవాలి

ప్రజాశక్తి అచ్యుతాపురం : ఖరీఫ్ 2023 కాలానికి ఆర్‌జిఎల్ 2537 రకం వరి విత్తనాలు కావలసిన రైతులు రైతు భరోసా కేంద్రంలో ఆధార్ కార్డు పట్టుకొని నమోదు చేయించుకోవాలని తిమ్మరాజుపేట రైతు భరోసా కేంద్ర అధికారి నీరజ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.

## ప్రభుత్వ పథకాలతో లక్షలాది మందికి లబ్ధి

ప్రజాశక్తి- అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన అనేక పథకాల ద్వారా లక్షలాదిమంది లబ్ధి పొందుతున్నారని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ పేర్కొన్నారు. అనకాపల్లి పట్టణంలోని 82వ వార్డు శారద కాలనీలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కార్పొరేటర్ మందపాటి సునీత, వైఎస్ఆర్‌పి పట్టణ పార్టీ అధ్యక్షుడు మందపాటి జానకి రామరాజు ఆధ్వర్యంలో గురువారం జరిగింది. కాలనీలో సుమారు 50 లక్షల రూపాయలతో నిర్మించనున్న కల్వర్ట్స్, కాలువల నిర్మాణానికి మంత్రి అమర్నాథ్ శంకుస్థాపన చేశారు. 50 లక్షల రూపాయలతో రోడ్లు కాలువలు నిర్మాణం చేపట్టామని, మరో 50 లక్షల రూపాయలతో కల్వర్టులు, కాలువల నిర్మాణం చేపడుతున్నామని తెలియజేశారు. కార్యక్రమంలో వైసిపి పట్టణ అధ్యక్షులు మందపాటి జానకి రామరాజు, ఎన్టీఆర్ జిల్లా ఆసుపత్రి డైరెక్టర్ డాక్టర్ జి రామ్మూర్తి, వైసిపి పట్టణ కార్యదర్శి గ్రెపూరి రాజు, అధిక సంఖ్యలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

మహిళకు కరపత్రం అందజేస్తున్న మంత్రి అమర్‌నాథ్

లోడింగ్‌కు వేచివున్న ట్రాక్టర్లు

## ఇసుక ర్యాంపు వద్ద ట్రాక్టర్ల బారులు

**ప్రజాశక్తి-నక్కపల్లి** :స్థానిక ఇసుక ర్యాంపు వద్ద ఇసుక లోడింగ్ కోసం ట్రాక్టర్లు క్యూ కట్టాయి. గత 20 రోజుల నుంచి కాంట్రాక్ట్ సంస్థ గడువు పూర్తయినందున నక్కపల్లి ఇసుక డిపో వద్ద ఇసుక నిల్వలు లేక పోవడంతో అమ్మకాలు పూర్తిగా నిలిచి పోయాయి. దీంతో కాలనీ లబ్ధిదారులతో పాటు, పలు నిర్మాణాలు చేపట్టుకునే వారంతా ఇసుక లేక డీలా పడిపోయారు. గత మూడు రోజుల నుంచి తాజాగా కాంట్రాక్ట్ కుదుర్చుకున్న సంస్థ రాజమహేంద్రవరం నుంచి ఇసుకను నక్కపల్లి డిపోకు లారీల్లో తరలించింది. గురువారం ఉదయం నుంచి నక్కపల్లి డిపో వద్ద ఇసుక అమ్మకాలు మొదలయ్యాయి. ఇసుక బుకింగ్ కోసం చాలా మంది తరలివచ్చారు. దీంతో బుకింగ్ కేంద్రం వద్ద రద్దీ కన్పించింది. ఎస్.రాయవరం, నక్క పల్లి మండలాల నుంచి పెద్ద సంఖ్యలో ఇసుక లోడింగ్ కోసం ట్రాక్టర్లను తీసుకువచ్చారు..

# మట్టి మాఫియాపై చర్యలు తీసుకోవాలి

**ప్రజాశక్తి-పాయకరావుపేట**:మట్టి మాఫియా పై చర్యలు తీసుకోవాలని రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు డిమాండ్ చేశారు. విశాఖపట్నంలో జల వనరుల శాఖ జిల్లా అధికారికి గురువారం వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వ్యవసాయ భూములు ఎత్తు పేరు చెప్పి గుంటపల్లి, దేవవరం ఆవ చెరువుల్లో మట్టిని అక్రమంగా రియల్ ఎస్టేట్ ప్లాట్లకు తరలిస్తున్నారన్నారు. అధికారులు, అధికార పార్టీ నాయకులు కుమ్మక్కై ప్రభుత్వ వనరులను దోపిడీ చేస్తున్నారని తెలిపారు. దీని పై ఉన్నతా ధికారులు స్పందించి మట్టి మాఫియాపై చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు. లేని పక్షంలో న్యాయ పోరాటానికి సిద్ధం అవుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు ఎం.నానాజీ తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న అప్పలరాజు

## రావిపాలెంలో వైద్య శిబిరం

**ప్రజాశక్తి-మాడుగుల:** మండలంలోని ఏజెన్సీ చట్ట చివరి గ్రామం రావిపాలెంలో గురువారం వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. పరీక్షల నిర్వహించి వారికి మందులు పంపిణీ చేశారు. గ్రామస్తులను ఆరోగ్యంపై అవగాహన కల్పించారు. కేజేపురం పి హెచ్ సి వైద్యాధికారి లీలా ప్రసాద్, జిల్లా మలేరియా అధికారి దొర, సబ్ యూనిట్ అధికారి ఎస్‌వి రమణ, ఆరోగ్య విస్తరణ అధికారి రవికుమార్, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

ర్యాలీ చేపడుతున్న వైద్యులు

## యోగాతో ఆరోగ్యం

**ప్రజాశక్తి -నక్కపల్లి** :పిల్లల నుంచి పెద్దల వరకూ నిత్యం యోగా సాధన చేయడంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని వేంపాడు ఆయుర్వేద డిస్పెన్సరీ వైద్యులు రమేష్ కుమార్ సూచిం చారు. ఈ నెల 21న యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని వేంపాడు గ్రామంలో ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో గురువారం అవగాహనా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్ఎం ఎం.నర్సింగరావు మాట్లాడుతూ, పిల్లలు యోగసనాలు, ధ్యానం, ప్రాణాయామం నేర్చు కోవడంతో ఆరోగ్యంతో పాటు జ్ఞాపకశక్తి పెంపొందుతుందన్నారు. ఈ కార్యక్రమంలో హైస్కూల్ పీడీ రామ్ కుమార్ , యోగా ఇన్ స్ట్రక్టర్లు కె.పార్వతీదేవి, దవరసింగి రాంబాబు, శివ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# వైసిపి రైతు విభాగం అధ్యక్షులు కనకారావు మృతి

**ప్రజాశక్తి -కొత్తకోట**:రావికమతం మండలం వైసిపి రైతు విభాగం అధ్యక్షులు మత్స కనకారావు (42) తీవ్ర అనారోగ్యానికి గురై ఆకస్మికంగా మృతి చెందారు. రావికమతం మండలం టి.అర్జాపురం గ్రామానికి చెందిన ఆయన గురువారం తన సోదరి కుమార్తె రజస్వల శుభ కార్యక్రమంలో ఉదయం నుంచి చురుకుగా పాల్గొన్నారు. సాయంత్రం సుమారు నాలుగు గంటల సమయంలో స్పృహ తప్పి పడి పోవడంతో స్నేహితులు ప్రధమ చికిత్స అందించి ఆటోలో నర్సీపట్నం తరలిస్తుండగా మార్గ మధ్యలో మృతి చెందారు. ఆయనకు ఇద్దరు చిన్న పిల్లలు, భార్య, తల్లి ఉన్నారు. గతంలో గంటా శ్రీనివాసరావుకు ముఖ్య అనుచరునిగా, ఇప్పుడు వైసీపీ కి ముఖ్య యువ నాయకునిగా పేరొందారు. కనకారావు మృతి పట్ల ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ, వైసీపీ మండల శాఖ అధ్యక్షులు ముక్కా మహాలక్ష్మి నాయుడు, కంచి పాటి జగ్గారావు, డిసిఎంఎస్ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, శీలం శంకర రావు తదితరులు కుటుంబానికి సంతాపం తెలియజేశారు.

## ఘనంగా అప్పికొండమ్మ పండగ

**ప్రజాశక్తి-గొలుగొండ**:మండలంలోని ఏఎల్‌పురంలో గురువారం అప్పికొండమ్మ పండుగను గ్రామస్థులు ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి గ్రామంలో గరగలు ఊరేగింపు నిర్వహించారు. గురువారం ఉదయం నుంచి భక్తులు అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

బారులు తీరిన భక్తులు

మాట్లాడుతున్న మంత్రి బూడి

## డిగ్రీ కళాశాల ప్రారంభం

**ప్రజాశక్తి-మాడుగుల**:మండల కేంద్రంలో గురువారం ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు ప్రారంభించారు. ఇన్నాళ్ళు జూనియర్ కళాశాల భవనంలో డిగ్రీ క్లాసులు జరిగేవి. స్వంత భవనం కోసం స్థలం కేటాయించారు. ఇది పూర్తి అయ్యేలోపు జడ్ పి పాఠశాల ఆవరణలో నిర్మించిన బాలికల వసతి గృహంలోకి మార్చి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి పెదబాబు, సర్పంచ్ కళావతి, కళాశాల అభివృద్ధి కమిటీ చైర్మన్ శ్రీనాథు శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ శాస్త్రి, బొమ్మిశెట్టి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

## పవన్‌పై అనుచిత వ్యాఖ్యలు తగవు

**ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్**:మాజీ మంత్రి పేర్ని నాని పవన్‌కల్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని జనసేన నర్సీపట్నం నియోజకవర్గ ఇన్చార్జ్ రాజాన వీరసూర్యచంద్ర తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ వారాహి యాత్రకు వచ్చిన ప్రజలను చూసి పేర్ని నానికి నిద్రపట్టలేదని, దీంతో పవన్ కళ్యాణ్ పై అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. పవన్ కళ్యాణ్ ఎప్పుడు మీటింగ్ లు పెట్టినా పేర్ని నాని మీడియా ముందుకు అనుచితంగా మాట్లాడటం అలవాటు అయ్యిందన్నారు. ఇకపై పవన్ జోలికి వస్తే చూస్తూ ఊరుకునేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం టౌన్ అధ్యక్షులు అద్దేపల్లి గణేష్, ప్రసాద్, డాక్టర్ నారాయణరావు, దొరబాబు పాల్గొన్నారు.

మాడుగులో చికిత్స చేస్తున్న అధికారులు

## పశువులకు వైద్య పరీక్షలు

**ప్రజాశక్తి-మాడుగుల**:మండల కేంద్రంలో గురువారం పశు విజ్ఞాన బడిలో భాగంగా 32 పశువులకు గర్భకోశ చికిత్సలు నిర్వహించారు. పశు సంవర్ధక శాఖ సహాయ సంచాలకులు చిట్టి నాయుడు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్ పశు భీమా, వేసవిలో పశువుల రక్షణ, దూడ పెయ్యలు మరణాల నివారణ తదితర అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. గేదెలు, మేకలకు నట్టల నివారణ మందులు సిద్ధంగా వున్నాయని రైతులు ఆర్‌బికేలను సంప్రదించాలని ఏడి తెలిపారు.

**చీడికాడ:** గొర్రెలకు, మేకలకు నట్టల నివారణ మందులను మండల పశు వైద్యాధికారిని గాయత్రి దేవి ఆధ్వర్యంలో జైతవరం గ్రామంలో ఉప సర్పంచ్ ఈర్లి చైతన్య చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పశువులకు ప్రభుత్వం కొత్తగా వైయస్సార్ పశు బీమా పథకం ప్రవేశపెట్టిందని, రైతులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పశుసంవర్ధక సహాయకులు మార్తా శ్రీనివాసరావు, కురచ రామకృష్ణ, వాలంటీర్ రాము పాల్గొన్నారు

# విద్యార్థులకు జెవికె కిట్లు పంపిణీ

నక్కపల్లిలో కిట్లు అందజేస్తున్న సర్పంచ్, ఎంపిటీసీ

**ప్రజాశక్తి-నక్కపల్లి**:మండలంలోని పెదతీనార్లలో ఎంపీయుపి స్కూల్లో గురువారం విద్యార్థులకు జగనన్న విద్యా కానుక కిట్లు పంపిణీ చేశారు. సర్పంచ్ మైలపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ సభ్యులు మెరుగు నాగేశ్వరరావు, డీలర్ కారే కొండలరావు చేతుల మీదుగా విద్యార్థులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కోటవురట్ల**:మండలంలోని పి.కొత్తపల్లిలో సర్పంచ్ ఎలగాడ బెన్నమ్మ చేతుల మీదుగా విద్యార్థులకు జగనన్న విద్యా కిట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శివ పార్వతి, వైసిపి నాయకులు శ్రీనివాస్ పాల్గొన్నారు.

**అనకాపల్లి** : మండలంలోని అక్కిరెడ్డి పాలెం తారకరామ కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం జగనన్న విద్యా కానుక కిట్లను ఎంపిపి గొర్లి సూరిబాబు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పిఏసి డైరెక్టర్ నారపిన్ని ప్రసాదరావు, స్కూల్ హెడ్ మాస్టర్ ప్రసాదరావు, ఎలిమెంటరీ స్కూల్ చైర్మన్ గణేష్, పంతం శ్రీను, బొండా అప్పారావు, సచివాలయ కన్వీనర్ ధనలక్ష్మి, తంగేటి ప్రకాష్ ,తీగల మోహన్, కనుబుడ్డి శంకర రావు, ఉపాధ్యాయులు, వైసిపి నాయకులు పాల్గొన్నారు.

**భీమునిపట్నం** : జివిఎంసి నాలుగో వార్డు కాపులుప్పాడ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో 102 మంది విద్యార్థులకు గురువారంవార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు జెవికె కిట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం ఇ కోటేశ్వరరావు, ఉపాధ్యాయులు పరదేశి, అనిల్ వాణి, రేవతి పాల్గొన్నారు.

భీమిలిలో..

కోటవురట్లలో..

**ఆనందపురం** : మండలంలోని తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లును గ్రామ సర్పంచ్ బిఆర్‌బి నాయుడు పంపిణీ చేశారు కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మజ్జి వెంకటరావు, పిఎంసి చైర్మన్ బాలి రమణమ్మ, హెచ్ఎం పి జ్యోతి, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. విద్యార్థులకు జెవికె కిట్లు, జగనన్న ఆణిముత్యాలు మెడల్స్ పంపిణీ చేశారు.

పరామర్శిస్తున్న విజయ్

## సర్పంచ్‌కు పరామర్శ

**ప్రజాశక్తి-గొలుగొండ**:ఇటీవల చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ తల్లి అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలిసిందే. ఈ మేరకు గురువారం గోపాలకృష్ణ కుటుంబాన్ని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్, ఆయన తల్లి చింతకాయల పద్మావతి పరామర్శించారు.

ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల సిబ్బంది

## సత్తా చాటిన శ్రీ రామానుజ విద్యార్థులు

**ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :** ఇటీవల విడుదలైన నీట్ - 2023 ఫలితాల్లో నగరంలోని శ్రీ రామానుజ జూనియర్ కాలేజ్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. 720 మార్కులకుగాను 624 మార్కులు సాధించిన ప్రభావ్ చుక్క 16692 ర్యాంకును, 622 మార్కులు సాధించిన అబిద్ ఖాన్ 17485 ర్యాంకును సాధించారు. ఈ సందర్భంగా సంస్థ డైరెక్టర్ వెలగా దత్తు ఇతర సిబ్బంది వారిని సన్మానించారు. కార్యక్రమంలో ఫిజిక్స్ అధ్యాపకులు ఈశ్వర్, కెమిస్ట్రీ అధ్యాపకులు రామాంజనేయులు, రామునాయుడు, జువాలజీ అధ్యాపకులు దామోదర్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ఉమా ప్రసాద్

## కౌలు రైతులకు అవగాహన

**ప్రజాశక్తి-నక్కపల్లి :**కౌలు రైతులు కౌలు పత్రాల (సిసిఆర్‌సి)కు నమోదు చేసుకోవాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మండలంలోని గునుపూడి గ్రామంలో గురువారం కౌలు పత్రాలు, ఈ పంట నమోదుపై అవగాహన కల్పించారు. వ్యవసాయ శాఖ అందిస్తున్న పథకాలు పొందాలంటే కౌలు రైతులు తప్పనిసరిగా కౌలు పత్రాలకు నమోదు చేసుకోవాలన్నారు. అనంతరం పొలాల్లో మట్టి నమూనాలు, ఆవశ్యకతను వివరించారు. ఈ పంట నమోదు పై అవగాహన కల్పించారు. వరి విత్తనాలు, పచ్చిరొట్టకు రైతు భరోసా కేంద్రాలను సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్‌బికె సిబ్బంది మోహన్, నాయుడు, సురేంద్ర పాల్గొన్నారు.

కేక్‌ను కట్ చేయిస్తున్న నేతలు

## ఘనంగా రెడ్డి సత్యనారాయణ జన్మదిన వేడుకలు

**ప్రజాశక్తి- చీడికాడ:**మాజీ మంత్రి, తెలుగుదేశం సీనియర్ నాయకులు రెడ్డి సత్యనారాయణ 98వ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. చీడికాడ మండలం పెద గోగాడ గ్రామంలో ఆయన స్వగృహం వద్ద మాడుగుల తెలుగుదేశం సీనియర్ నాయకులు పైలా ప్రసాద్‌రావు, మాడుగుల ఇంచార్జ్ పివిజి కుమార్, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడులతో సహా పలువురు నాయకులు తరలివచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పైలా ప్రసాదరావు మాట్లాడుతూ, రాజకీయాల్లో రెడ్డి సత్యనారాయణ ఆదర్శవంతమైన జీవితం గడిపారన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు రెడ్డి రాము, మండల పార్టీ ప్రెసిడెంట్, పోతల చిన్నాయుడు, టిడిపి జిల్లా అధికార ప్రతినిధి రెడ్డి సన్యాసినాయుడు, దొకల అప్పలనాయుడు, గొర్లె గణేష్, మాజీ ఎంపిపి కుచ్చు కలావతి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని

# అంగన్‌వాడీల ఆందోళనలు

సబ్బవరంలో...

నర్సీపట్నంలో ఆందోళన చేపడుతున్న అంగన్‌వాడీలు

**ప్రజాశక్తి-సబ్బవరం:**అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో స్థానిక ఐసిడిఎస్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా యూనియన్ అధ్యక్షరాలు వివి.రమణమ్మ మాట్లాడుతూ అంగన్వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి కనీస వేతనాలు, పింఛను, గ్రాడ్యుటీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమస్యలను పరిష్కరించకుంటే జులై 10, 11 తేదీల్లో కలెక్టర్ కార్యాలయాల ఎదుట ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బి.రమణమ్మ, ఎస్. జగదీశ్వరి, ఎం. రమణి తదితరులు పాల్గొన్నారు.

**కశింకోట :** కసింకోట ఐసిడిఎస్ ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద అంగన్వాడీ యూనియన్ ఆధ్వర్యంలో ధర్నా చేసి, సమస్యలపై వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా అంగన్వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షులు ఎమ్.నాగశేషు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుగుణంగా కనీస వేతనం ఇవ్వాలని, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటి, రిటర్మెంట్ బెనిఫిట్స్ ఐదు లక్షలు, వేతనంలో సగం పెన్షన్ ఇవ్వాలని, రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాకారపు శ్రీనివాసరావు, ఐద్వా జిల్లా నాయకురాలు డి వరలక్ష్మి, అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు టి తనుజా, నాయకులు శ్యామలా, లక్ష్మి, రజిని, కుమారి, జ్యోతి, చిన్నారి పాల్గొన్నారు.

**నర్సీపట్నం టౌన్:** అంగన్వాడి హెల్పర్స్, సిఐటియు ఆధ్వర్యాన ఐసిడిఎస్ కార్యాలయం ముందు నిరసన చేపట్టారు. అంగన్వాడీ హెల్ప్ హెల్పర్లు, వర్కర్లు మాట్లాడుతూ, అంగవాడీలకు గ్రాట్యూటీ, ఇతర సమస్యల పరిష్కారం చేయాలని కోరారు. అంగన్ వాడీ వర్కర్లకు ఉద్యోగ భద్రత, కనీసవేతనం అమలు చేయాలన్నారు. రకరకాల యాప్ లు తెచ్చి పనిభారం పెంచుతున్నారన్నారు. జూలై 10, 11తేదీలలో కలెక్టర్ కార్యాలయాల వద్ద నిరవదిక ఆందోళనలు చేస్తామన్నారు.

కశింకోటలో..

# ఎమ్‌డి శ్రీధర్‌ను కలిసిన వీసం

**ప్రజాశక్తి -నక్కపల్లి:**ఆంధ్రప్రదేశ్ అర్బన్ ఆర్థిక మౌలిక సదుపాయములు అభివృద్ధి కార్పొరేషన్ ఎండి శ్రీధర్‌ను గురువారం తాడేపల్లిలో సంస్థ ప్రధాన కార్యాలయంలో కలిసి సన్మానించినట్లు రాష్ట్ర పట్టణ నైపుణ్యాభివృద్ధి సంస్థ డైరెక్టర్ వీసం రామకృష్ణ స్థానిక విలేకరులకు తెలిపారు. అభివృద్ధి పనులపై ఆయనతో చర్చించామన్నారు. ఎంపీ విజయసాయిరెడ్డిని కూడా మర్యాదపూర్వకంగా కలిసినట్లు తెలిపారు. ఆయన వెంట అనకాపల్లి జిల్లా విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షులు కొప్పిశెట్టి హరిబాబు, నెల్లిపూడి సర్పంచ్ సురేష్ వర్మ, వైసిపి నాయకులు తళ్ళ భార్గవ్, గోవింద్ పాల్గొన్నారు.



శ్రీధర్‌ను సన్మానిస్తున్న వీసం

# పేదల అభ్యున్నతికి సిఎం కృషి

-ఎమ్మెల్యేలు గణేష్, బాబూరావు -పలు చోట్ల గడప గడపకు...

ఎమ్మెల్యే గణేష్‌కు స్వాగతం పలుకుతున్న మహిళలు

సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే బాబూరావు

**ప్రజాశక్తి-గొలుగొండ:**పేదల ఆర్థిక స్వావలంభనే ముఖ్యమంత్రి వైయస్.జగన్‌మోహన్‌రెడ్డి ధ్యేయమని నర్సీపట్నం ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్‌గణేష్ అన్నారు. మండల పరిధిలో పాకలపాడు పంచాయతీలో గురువారం గడపగడపకు మన ప్రభుత్వం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అంబేద్కర్, వైయస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, నవరత్నాలు, పేదలకు ఇళ్లను పార్టీలతో సంబంధం లేకుండా అందిస్తున్నామన్నారు. విద్య, వైద్యరంగాలకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ముందుగా పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు, ఎంపిపి గజ్జలపు మణికుమారి, మండల వైయస్సార్ పార్టీ అధ్యక్షులు లెక్కల సత్యనారాయణ, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షురాలు లోచల సుజాత, ఏఎంసి చైర్మన్ కొల్లు సత్యనారాయణ, పిఎసిఎస్ అధ్యక్షులు కిలపర్తి పెద్దిరాజు, యూత్ అధ్యక్షులు మాకిరెడ్డి రామకృష్ణనాయుడు, సేవాదళ్ అధ్యక్షులు రమేష్, గొలుగొండ మండల సచివాలయం కన్వీనర్లు అధ్యక్షులు పాణి శాంతారావు, స్థానిక సర్పంచ్ రాజాన పద్మ, పాకలపాడు వైసిపి ప్రెసిడెంట్ రమేష్, గొలుగొండ మండలం వైయస్సార్ పార్టీ ప్రధాన కార్యదర్శి రమణ పాల్గొన్నారు.

**నక్కపల్లి:**మండలంలోని చినదొడ్డిగల్లు లో గురువారం రెండవ రోజు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి గ్రామంలో పర్యటించారు. ప్రజా సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సంక్షేమ పథకాలకు సంబంధించిన కరపత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రజా సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నం, జడ్పిటిసి కాసులమ్మ, మండల పరిషత్ ఉపాధ్యక్షులు నానాజీ, ఈశ్వరరావు, నాయకులు శీరం నరసింహమూర్తి, శేషారత్నం తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనిధి మేనేజర్ కరుణానిధి

## ఉపాధి కల్పించాలి

**ప్రజాశక్తి -కోటవురట్ల:**గ్రామీణ ప్రాంతాల్లో జీవనోపాధి కల్పనకు వివోఏలు ప్రధాన భూమిక పోషించాలని వెలుగు శ్రీనిధి మేనేజర్ కరుణానిధి అన్నారు. గురువారం ఆయన మండల వెలుగు సమైక్య సమావేశం మందిరంలో వివోఏలతో రివ్యూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ స్కీం కింద గ్రామీణ ప్రాంతాలలో ఉపాధి కల్పనకు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. బీసీలకు 35 శాతం, ఓసిలకు 25 శాతం వరకు సబ్సిడీ అందించే అవకాశం ఉన్నందున ఆశావహులను ఎంపిక చేయాలని సూచించారు. ఎస్సీ ఎస్టీలకు ఉన్నతి పథకం ద్వారా రుణాలు అందజేయాలని, శ్రీనిధి, డ్వాక్రా రుణాలు సకాలంలో అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం రమణకుమారి, వివిధ గ్రామాలకు చెందిన వివోఏలు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్‌కు అంతరాయం

**ప్రజాశక్తి గొలుగొండ :** మండలంలో విద్యుత్ లైనులకు అడ్డువచ్చిన చెట్లను నరికేందుకు శుక్రవారం కొన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను నిలుపుదల చేస్తామని ట్రాన్స్ కో నర్సీపట్నం ఇఇ వి వి రామకృష్ణారావు తెలిపారు. ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, గొలుగొండ సబ్ స్టేషన్ పరిధిలో కొత్త మల్లంపేట, లింగంపేట, చోద్యం, గాదం పాలెం, అమ్మపేట పంచాయతీలలో ట్రీ కటింగ్ పెట్టామ్నారు. ఉదయం 6 గంటల 30 నిమిషాల నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాను నిలిపివేస్తున్నామన్నారు.

## తగ్గని ఎండల తీవ్రత

**ప్రజాశక్తి- కోటవురట్ల:**పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో జనం అల్లాడి పోతున్నారు. గడిచిన నాలుగు రోజుల్లో ఎండల తీవ్రత అధికంగా ఉంటుంది. దీంతో, విద్యార్థులు బడులకు వెళ్లి వచ్చేందుకు అవస్థలు పడుతున్నారు.

ఎండలో వస్తున్న విద్యార్థులు